


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 221 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 21 జూన్ 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE : 221 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 21 JUNE 2026 PRICE : 1/- RS
Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## మూడ్రోజులు ఢిల్లీలో సీఎం

### రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రేవంత్ లేఖ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్సీపీ(ఎస్‌పీ) నేత శరద్‌పవార్ మనవరాలు, ఎంపీ సుప్రియా సులే కుమార్తె వివాహ రిసెప్షన్‌కు శనివారం ముంబయి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆదివారం ఢిల్లీ వెళ్లనున్నారు. సోమ, మంగళవారాలు అక్కడే ఉండి పలు అంశాలపై కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఇందులో భాగంగా మెట్రోకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రుణం, రెండోదశ గురించి చర్చించేందుకు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా లేఖ రాశారు. 22, 23 తేదీల్లో సమయమిస్తే ఇద్దరం కలిసి వెళ్లి హైదరాబాద్, తెలంగాణకు అతి ముఖ్యమైన ఈ రెండు అంశాల గురించి చర్చిద్దామని, సమయం
ఖరారు చేయించాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో అంశంలో మీ జోక్యాన్ని కోరుతూ అన్ని వివరాలతో 16న లేఖ రాశానని, సమావేశం ఏర్పాటు చేయిస్తే అవసరమైన రికార్డులు, వాస్తవాలు సమర్పిస్తానని సీఎం తాజా లేఖలో చెప్పారు. అన్ని ఒప్పందాలు, అనుబంధ డాక్యుమెంట్లను కూడా తనతో పాటు తీసుకొస్తున్నానని పేర్కొన్నారు.



## ఉచితాలపై ఉద్యమం రావాలి

### 'ఆర్థిక వ్యవస్థకు యుద్ధం సెగ' పుస్తకావిష్కరణలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** 'ఉచిత పథకాలతో అభివృద్ధి గాడి తప్పుతోంది. వాటితో జరుగుతున్న నష్టాలపై పెద్దఎత్తున చర్చలు అవసరం. ప్రజలకూ అవగాహన కల్పించాలి. పార్టీలకతీతంగా ఉద్యమం రావాలి. వ్యవస్థలను రక్షించుకోవడంపై పాలకులూ దృష్టి సారించాలి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బ్యాంకింగ్ వ్యవహారాల నిపుణుడు తుమ్మల కిశోర్ రచించిన 'ఆర్థిక వ్యవస్థకు యుద్ధం సెగ' పుస్తకావిష్కరణ శనివారం జూబ్లీహిల్స్‌లోని వెంకయ్యనాయుడి నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నా దేశ ఆర్థిక వ్యవస్థ కుదుపులు లేకుండా సాగుతుందంటే అది మన ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. 'సమకాలీన ఆర్థిక సవాళ్లపై తుమ్మల కిశోర్ సమయానుకూల పుస్తకాన్ని రాశారు.

- మిగతా 2లో



## దేవుడి పేరు చెప్పకుండా గెలిచే దమ్ముందా..?

### బీజేపీపై మహేష్ గౌడ్ ఫైర్

**హైదరాబాద్ పెన్ పవర్:** మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరిస్కరించిన ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్?ను ఉరి తీసినా తప్పు లేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను నిరసిస్తూ శనివారం (జూన్ 20) గాంధీ భవన్‌లో

- మిగతా 2లో

# కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

### తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి

- కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం
- బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి
- కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.
సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.



## మా సెక్రటేరియట్ వైపు చూస్తే ఊరుకోం..

### పవన్ కల్యాణ్‌పై కవిత హాట్ కామెంట్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై టీఆర్ఎస్ చీఫ్ కవిత హాట్ కామెంట్స్ చేశారు. పవన్ కళ్యాణ్ సినిమాలు చూసి సంతోషిస్తాం.. కానీ ఆయన మా సెక్రటేరియట్ వైపు చూస్తే ఊరుకోమని అన్నారు. పవన్ కల్యాణ్ ఏపీకి ఉపముఖ్యమంత్రి.. ఆయనకు ఇక్కడేం పని అని ప్రశ్నించారు.

- మిగతా 2లో

## హార్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం - ఇరాన్



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా– ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హార్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు

- మిగతా 2లో



## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు
- ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి దేశం నుంచి పంపిస్తామని స్పష్టీకరణ
- ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడుంటారని ఉద్ఘాటన

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని

- మిగతా 2లో

## రూ.10 లక్షల కోట్ల అప్పు..

### విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

- ఆర్థికవేత్తలు, నిపుణులతో సంప్రదింపుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లు దాటాయని శ్వేతపత్రంలో వెల్లడి
- 2031 నాటికి పని చేసే వయసు జనాభా తగ్గనుందని, ఇప్పుడే చర్యలు తీసుకోవాలని హెచ్చరిక

- మిగతా 2లో



## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత.. హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

- కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ముద్రగడ
- ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు
- కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన జగన్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైసీపీ అధినేత
- రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చామన్న కుటుంబ సభ్యులు

- మిగతా 2లో



## 'పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు'.. కుండబద్ధలు కొట్టిన అమెరికా!



- ఇరాన్‌తో ఒప్పందం విషయంలో గందరగోళం
- అమెరికా తరహాలో పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదన్న వాన్స్
- అందుకే ఒప్పంద వివరాలు త్వరగా వెల్లడి కాలేదని వ్యాఖ్య
- ఒప్పందం కుదర్చడం తమ ఘనతగా చెప్పుకొంటున్న పాక్
- వాన్స్ వ్యాఖ్యలతో పాక్‌కు ఇబ్బందికర పరిస్థితి


- మిగతా 2లో

## పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ
- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం
- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం–కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను

- మిగతా 2లో



## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం
- హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి
- తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్
- హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారా? ఈ ప్రచారంలో నిజమెంత?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కాంగ్రెస్ తో జత కడుతున్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఇటీవల మీడియా సమావేశంలో ఆయన చేసిన కాక్రోచ్ వ్యాఖ్యలతో ఆయన కాంగ్రెస్ కు మరింత చేరువయ్యారని, బీజేపీకి దూరమవుతున్నారన్న కక్యాంపెయిన్ సోషల్ మీడియాలో నడుస్తుంది. అంతకు ముందు నుంచే ఈ ప్రచారం జరుగుతుంది. కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని సోషల్ మీడియాలో హోరెత్తిపోతుంది. బెంగళూరులో తన నివాసంలో ఉంటున్న జగన్ డీకే శివకుమార్ తో భేటీ అయ్యారన్న వార్తలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి.

**కర్ణాటక నుంచి...**

బీజేపీ పై దేశ వ్యాప్తంగా ఎదురవుతున్న వ్యతిరేకతతోనే కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని, అందుకే కర్ణాటక నుంచి వైఎస్ షర్మిలకు రాజ్యసభ స్థానం దక్కకుండా చేయడం వెనక కూడా జగన్ ఉన్నారంటూ మరొక ప్రచారం కూడా జరిగింది. తాజాగా ఏపీలో తాము కాక్రోచ్ లుగా మారుతామని జగన్ చేసిన వ్యాఖ్యలను తీసుకుని ఆయనను హస్తం పార్టీకి దగ్గర చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇందులో నిజానిజాలు పరిశీలిస్తే... జగన్ కాంగ్రెస్ తో జత కట్టడానికి అసలు ఇష్టపడరు. ఎందుకంటే 2012లో పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. అప్పటి నుంచి జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వస్తున్నారు. ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ తో కలవకుండానే ఎన్నికల్లో పోటీ చేస్తూ తన పార్టీకి ప్రత్యేక ఓటు బ్యాంకును సంపాదించుకున్నారు.

**ఏపీ రాజకీయాలకే...**

జగన్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకే పరిమితమవుతారు. ఆయన తెలంగాణ వైపు కూడా చూడరు. అలాంటింది రాష్ట్ర విభజనకు కారణమయిన కాంగ్రెస్ తో ఎందుకు జట్టు కడతారు? అన్న ప్రశ్నకు ప్రచారం చేసే వారి నుంచి సమాధానం ఉండదు. అందులోనూ వైసీపీ ఓటు బ్యాంకు అంతా కాంగ్రెస్ నుంచి వచ్చిందే. మళ్లీ కాంగ్రెస్ తో కలిస్తే తాను రెండు దశాబ్దాలుగా ఏర్పరచుకున్న ఓటు బ్యాంకును తిరిగి కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపే చేసే చర్యలకు అస్సలు దిగరన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. బీజేపీ ఇప్పుడు కేంద్రంలో బలంగా ఉంది. ప్రాంతీయ పార్టీల విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తుంది. జగన్ బీజేపీకి రహస్య మిత్రుడు. బలమైన బీజేపీని కాదని, కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునేంత రాంగ్ స్టెప్ ను రాజకీయంగా జగన్ వేయరన్నది కూడా అంతే వాస్తవం. అందుకే జగన్ వచ్చే ఎన్నికల్లోనూ ఒంటిరిగానే పోటీ చేస్తారు. ఒకవేళ ఎన్నికల అనంతరం పొత్తు ఇవ్వాల్సి వస్తే బీజేపీతో చేతులు కలుపుతారు కాని, తనను పధ్నాలుగు నెలల పాటు జైల్లో ఉంచిన కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతివ్వరన్నది వాస్తవం.

# ఉచితాలపై ఉద్యమం రావాలి

- మొదటి పేజి తరువాయి

సామాన్యుడికీ అర్థమయ్యేలా ఎన్నో ఆర్థిక విషయాలు అందులో ప్రస్తావించడం అభినందనీయం” అని పేర్కొన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. ‘యుద్ధం కారణంగా వచ్చిన క్లిష్ట పరిస్థితులను మన దేశం తట్టుకున్నట్లు ఏ దేశం తట్టుకోలేదు. కేవలం 3 నెలల్లో మన ప్రభుత్వం రూ. 4లక్షల కోట్లు అదనంగా ఖర్చు చేసింది. ఇది మన దేశ గొప్పతనం. కానీ, తెలుగు రాష్ట్రాల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. అభివృద్ధి కూడా కేవలం నగర కేంద్రంగా సాగుతోంది. ప్రగతి అందరి జీవితాలను తాకుతుందన్న నమ్మకం కలగడం లేదు. తన జీవితమూ బాగుపడుతుందని సామాన్యుడు నమ్మాలి. ఆర్థిక విషయాలు, హద్దుమీరుతున్న ఉచితాలపై కూడా విస్తృతంగా ప్రజల్లో చర్చ జరగాలి” అని అన్నారు.
అనంత్ టెక్నాలజీస్ అధినేత పావులూరి సుబ్బారావు మాట్లాడుతూ.. సారా నిషేధ ఉద్యమం తరహాలో పొదుపు ఉద్యమం రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ‘ఈనాడు’ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు శ్రీధర్, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవుడి పేరు చెప్పకుండా గెలిచే దమ్ముందా..?

- మొదటి పేజి తరువాయి

తెలంగాణ కాంగ్రెస్ సేవ్ డెమోక్రసీ పేరుతో సత్యాగ్రహ దీక్ష చేపట్టింది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ కుట్రపూరితంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించిందని ఆరోపించారు. బీజేపీ పాలన అడ్డూ అదుపు లేకుండా సాగుతుందని.. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ తీరు చూస్తే.. మోడీ దుర్మార్గం అర్థం అవుతుందని విమర్శించారు. మతం పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని.. అధికారం కోసం ఏ చేసేందుకైనా బీజేపీ సిద్ధంగా ఉందని ధ్వజమెత్తారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై బీజేపీకి నమ్మకం లేదని.. మేం చెప్పిందే రాజ్యాంగం అన్నట్లుగా ఆ పార్టీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. టీఎంసీ, శివసేన, ఎన్సీపీ పార్టీలను నిలువునా చీల్చి రాజ్యాంగాన్ని బీజేపీ అపహస్యం చేస్తోందన్నారు. మోడీ కుట్రలను కాంగ్రెస్ తిప్పికొడుతుందని పేర్కొన్నారు. బీజేపీ గాడ్సే జపం చేస్తోందన్నారు. ఉదయం లేస్తే దేవుడి పేరు జపం చేస్తారు.. దేవుడు పేరు చెప్పకుండా బీజేపీ నేతలకు గెలిచే దమ్ముందా అని ప్రశ్నించారు. దేశంలో 90 శాతం సంపద బీజేపీ నేతల అనునయుల చేతిలో ఉందని ఆరోపించారు. బీజేపీ అప్రజాస్వామిక చర్యలు దేశ ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. బీజేపీకి తెలంగాణలో స్థానం లేదు.. మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

# మా సెక్రటేరియట్ వైపు చూస్తే ఊరుకోం..

- మొదటి పేజి తరువాయి

అక్కడ రాజకీయాలు చేసుకోండి.. ఇక్కడ సినిమాలు తీసుకోండని సూచించారు. గతంలో మన భాషను వెక్కిరించి రాష్ట్రాన్ని కబ్జా చేశారని విమర్శించారు. సినిమాల పరంగా పవన్ కల్యాణ్ ఓకే.. కానీ అతడు రాజకీయాల్లో అన్ఫిట్ అని విమర్శించారు. పవన్ కళ్యాణ్ సినిమాలు చూసి ఎంజాయ్ చేద్దామన్నారు. శనివారం (జూన్ 20) కవిత వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలు ప్రారంభిస్తామని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ఒక్క విద్యా సంస్థ వరంగల్?కు రాలేదన్నారు.
విద్య, వైద్యం, ఉద్యోగ కల్పనలో ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క జిల్లాను ఆరు ముక్కలు చేశారని మండిపడ్డారు. కీలకమైన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్?కు కమిషనర్ లేరన్నారు. కాంగ్రెస్ తీరుతో రాష్ట్రం ఎందుకు సాధించుకున్నామని ప్రజల్లో మళ్లీ ఆలోచన వస్తోందని అన్నారు. కాంగ్రెస్ నేతలు మార్కెట్లకు వెళ్తే రైతులు తన్ని తరిమేస్తారు. ఒక్క నాయకునికైనా మార్కెట్?లకు వచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంజీఎం ఆస్పత్రిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి నిజంగానే నియంత హిట్లర్?లా ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ ఇసుక దోపిడీ సీఎం కనుసన్నల్లో జరుగుతోందని ఆరోపించారు. మంత్రులు పొంగులేటి, సీతక్క కలిసి ఇసుక దోపిడీ చేస్తున్నారని అన్నారు. గోదావరి గర్భశోకానికి గురయ్యేలా చేస్తున్నారు. ఈ ఇసుక దోపిడీపై సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ‘పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు’..

అమెరికా–ఇరాన్ శాంతి ఒప్పందం విషయంలో పాకిస్థాన్‌కు మరోసారి ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఇస్లామాబాద్‌ను ఇరకాటంలోకి నెట్టాయి. ఒప్పంద వివరాల విడుదల ఆలస్యంపై స్పందించిన ఆయన పాకిస్థాన్‌లో అమెరికా తరహా పత్రికా స్వేచ్ఛ లేదని వ్యాఖ్యానించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన వాన్స్ అమెరికాలో ఒప్పందాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలనే అంచనాలు ఉంటాయని చెప్పారు. కానీ పాకిస్థాన్, ఖతార్ వ్యవస్థల్లో అలాంటి సంప్రదాయం లేదని వ్యాఖ్యానించారు. అందుకే ఇరాన్‌తో ఒప్పంద వివరాలు విడుదల చేసే విషయంలో కొంత గందరగోళం ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో పాకిస్థాన్ 180 దేశాల్లో 153వ స్థానంలో ఉంది. అక్కడ జర్నలిస్టుల స్వేచ్ఛపై అంతర్జాతీయ సంస్థలు గతంలోనూ ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో వాన్స్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు అమెరికా–ఇరాన్ ఒప్పందాన్ని తమ దౌత్య విజయంగా పాకిస్థాన్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అయితే స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన సంతకాల కార్యక్రమం రద్దు కావడం కూడా పాకిస్థాన్‌కు ఇబ్బందిగా మారింది. చివరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ డిజిటల్ పద్ధతిలో ఒప్పందంపై సంతకాలు చేశారు.

# రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న ‘హైడ్రా’పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు
హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. “రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం” అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. “లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు” అని తేల్చిచెప్పారు.

# హార్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హార్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్–అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది. నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (x=+జ) స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు
తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

# భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. “ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం” అని ఆయన పేర్కొన్నారు.

## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత.. హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవమున్న సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలియడంతో ఇరు రాష్ట్రాల్లోని ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు.
గత కొన్ని రోజులుగా ముద్రగడ పద్మనాభం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్య సమస్యలు కాస్త ఎక్కువవడంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్ తీసుకొచ్చి ఆసుపత్రిలో జాయిన్ చేశారు. గత రెండు రోజులుగా వైద్యులు ఆయనకు డయాలసిస్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని చికిత్స అందిస్తున్న డాక్టర్ల టీమ్ అధికారికంగా వెల్లడించింది. ముద్రగడ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వైసీపీ అధినేత జగన్... ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా ఆరా తీశారు. ముద్రగడ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పిన జగన్... ఆయన అత్యంత త్వరగా, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు, ముద్రగడ ఆసుపత్రిలో చేరారనే వార్త బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షురూ అయ్యాయి. దీంతో ఆయన ఆరోగ్యంపై కాపు శ్రేణుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, ముద్రగడ కుటుంబ సభ్యులు వెంటనే స్పందిస్తూ ఆందోళనలకు చెక్ పెట్టారు. “ఆయన క్షేమంగా ఉన్నారు. కేవలం రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చాం. దయచేసి ఇంటర్నెట్‌లో వచ్చే ఎలాంటి అవాస్తవాలను, తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు” అని విజ్ఞప్తి చేశారు.

# పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. ‘పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్’ సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ–కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు జూఎెఐఖఅ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లోని ‘ఫార్మర్స్ కార్నర్’ను సందర్శించవచ్చు.

# రూ.10 లక్షల కోట్ల అప్పు..

## విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

తమిళనాడు రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఈ విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ‘వుయ్ ది లీడర్’ వ్యవస్థాపకుడు కె. అన్నామలై రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం ఇటీవలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన నేపథ్యంలో అన్నామలై ఈ ప్రతిపాదన చేశారు. ప్రభుత్వం జూన్ 16న విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం, తమిళనాడు ప్రత్యక్ష అప్పులు దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరాయి. ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలను కూడా పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రం మొత్తం అప్పు రూ. 13.18 లక్షల కోట్లుగా ఉంది. రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయంలో 22.8 శాతం కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చిస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక దుర్వినియోగానికి ఈ శ్వేతపత్రం ఒక ‘పోస్ట్‌మార్టమ్’ లాంటిదని జూన్ 19న అన్నామలై వ్యాఖ్యానించారు. ఈ నివేదికను కేవలం ఒక సాకుగా చూపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని, తక్షణ దిద్దుబాటు చర్యల చేపట్టేందుకు దీనిని ఒక మార్గసూచిగా పరిగణించాలని ఆయన హితవు పలికారు. 2031 నాటికి తమిళనాడులో పనిచేసే వయసున్న జనాభా క్రమంగా తగ్గనుందని, ఇది అత్యంత ఆందోళనకరమైన విషయమని అన్నామలై హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకోవడానికి, అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వానికి గడువు చాలా తక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్

- పోక్సో కేసులో నెల రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన మల్కాజ్‌గిరి కోర్టు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన భగీరథ్ వ్యవహారం

-4లో









## "బురగరాజ్-సాయిరాజ్" కబ్జాలపై..!
# రెవెన్యూ 'పంజా'..!

- సర్వే నెంబర్ 342 ప్రభుత్వ భూమిలో 20 అక్రమ నిర్మాణాలు డిమాలిషన్..
- ప్యారా లీగల్ వాలంటీర్ ఫిర్యాదుతో చర్యలకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం..

- గాజులరామారం ప్రభుత్వ భూముల్లో పాతుకుపోయిన కబ్జాదారులు..
- సర్వే నెంబర్ 307 ప్రభుత్వ భూమిలో కూల్చినవి మళ్ళీ నిర్మాణాలపై ఫిర్యాదులు..
- కబ్జాదారుడు నర్సింహుడిపై కూడా రెవెన్యూ దృష్టి సారించాలని విజ్ఞప్తి..

-6లో

# బౌరంపేట్ సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం : బీజేపీ నేత పీసరి కృష్ణారెడ్డి

## వాటర్ పైప్‌లైన్ పగిలి రోజుల తరబడి వృథాగా పోతున్న త్రాగునీరు..



పీసరి కృష్ణారెడ్డి.. బీజేపీ దుండిగల్ సర్కిల్ అధ్యక్షుడు..

- విద్యుత్ స్తంభం ఏర్పాటు పేరుతో పచ్చని చెట్ల తొలగింపుపై స్థానికులు ఆగ్రహం..
- డ్రైనేజీ,తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపణ..
- బౌరంపేట్‌లో పోలీస్ గస్తీ పెంచాలని డిమాండ్..
- వాహనాలు వేగంతో వరుస ప్రమాదాలు.. ఇప్పటికే ముగ్గురు మృతి..
- పాఠశాలలు, దేవాలయాల వద్ద తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు బీజేపీ డిమాండ్..



-4లో

# హైకోర్టులో అప్పీల్ నిర్లక్ష్యం..! రూ.1000 కోట్ల ప్రభుత్వ భూమి ధారాదత్తం..?

- ఒక ప్రభుత్వ భూమికి 4 ఏళ్ళు..! మరోచోట 2 ఏళ్ళుగా అప్పీల్ జాప్యం..!
- భూముల పరిరక్షణకు వెంటనే హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలి: ఆకుల సతీష్..



-5లో

నిజాంపేట్, బాచుపల్లి పరిధిలోని సుమారు రూ.1000 కోట్ల విలువైన ప్రభుత్వ భూముల విషయంలో, హైకోర్టు తీర్పులపై, రెవెన్యూ అధికారులు ఇప్పటికీ అప్పీళ్లు దాఖలు చేయకపోవడాన్ని ఆకుల సతీష్ తీవ్రంగా ప్రశ్నించారు.. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాచుపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిమాండ్ చేశారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 20:

- బాచుపల్లి మండలంలో రూ. కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమి ప్రైవేటు పరం.?
- హైకోర్టు తీర్పులపై అప్పీళ్లు పెండింగ్ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు..
- నిజాంపేట్‌లో 26 ఎకరాల భూ వివాదం. బాచుపల్లిలో ఆక్రమణలపై చర్యల డిమాండ్
- ప్రభుత్వ భూములు కాపాడాలని స్థానికులతో ఆకుల సతీష్ టీమ్ హెచ్చరిక..
- బాచుపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు ప్ల కార్డుల ప్రదర్శనతో ధర్నా..

# గురువారెడ్డివి తప్పుడు ఆరోపణలు
## మంత్రి వివేక్ వెంకటస్వామి




**హైదరాబాద్ పెన్ పవర్:** గత నెల రోజులుగా టీసీఏ అధ్యక్షుడు గురువారెడ్డి విశాఖ ఇండస్ట్రీస్‌పై నిరాధార ఆరోపణల తో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విశాఖ ఇండస్ట్రీస్ ఛైర్మన్, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్పాన్సర్ చేసిన సంస్థపై అసత్య ప్రచారం చేయడం బాధాకరమన్నారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మాజీ ఎమ్మెల్యే విరాళం..

ఈ ఉత్సవాలకు తనవంతు సహాయంగా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు రజకులకు రూ.25 వేలు విరాళాన్ని అందజేశారు.. కొన్ని కారణాల దృష్ట్యా మాజీ ఎమ్మెల్యే హాజరుకాలేక పోవడంతో తన మనుషులతో ఈ విరాళం పంపించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.. గ్రామ ప్రజలు ఐక్యంగా దేవాలయ నిర్మాణం చేపట్టి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని ఫోన్‌లో పేర్కొన్నారు..దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అందించిన ఆర్థిక సహాయానికి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా దేవాలయ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని కమిటీ సభ్యులు కోరారు.. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు..






- భారీగా తరలివచ్చిన భక్తజనం బస్వాపూర్‌లో ఆధ్యాత్మిక సంబరాలు..
- మాచయ్యస్వామి ఆలయానికి మాజీ ఎమ్మెల్యే జి.గోవర్ధన్ రూ.25 వేల విరాళం..
- భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు..
- రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులంతా ఏకతాటిపై ఉత్సవాలు ప్రారంభం..
- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రూ.25 వేల విరాళం అందజేత..
- గ్రామ ఐక్యత, భక్తి భావానికి ప్రతీకగా నిలిచిన మాచయ్యస్వామి ఉత్సవాలు..

## భక్తిశ్రద్ధలతో శ్రీ మడివేలు మాచయ్యస్వామి..
# తొలి ఉత్సవాలు..!



### బస్వాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ మడివేలు మాచయ్యస్వామి దేవాలయం..

భిక్నూర్, పెన్ పవర్, జూన్ 20:బస్వాపూర్‌లో శ్రీ మడివేలు మాచయ్య స్వామి దేవాలయం తొలిసారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.. నాలుగు రోజులపాటు జరిగే ఈ మడివేలు మాచయ్యస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.. గ్రామంలో నూతనంగా నిర్మించిన రజకుల ఆరాధ్య దైవం శ్రీ మడివేలు మాచయ్యస్వామి దేవాలయంలో తొలిసారిగా వార్షిక ఉత్సవాలను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామంలోని యువకులు, పెద్దలు, మహిళలు ఉత్సవాల ఏర్పాట్లలో చురుకుగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.. ప్రత్యేకంగా బస్వాపూర్ గ్రామ ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి దేవాలయ అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణకు సహకరించడం విశేషంగా నిలిచింది.. గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ వేడుకలు భక్తి, సంప్రదాయాల సమ్మేళనంగా కొనసాగాయి..


# బౌరంపేట్ సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం : బీజేపీ నేత పీసరి కృష్ణారెడ్డి

## వాటర్ పైప్‌లైన్ పగిలి రోజుల తరబడి వృథాగా పోతున్న త్రాగునీరు..



పీసరి కృష్ణారెడ్డి..
బీజేపీ దుండిగల్
సర్కిల్ అధ్యక్షుడు..

- విద్యుత్ స్తంభం ఏర్పాటు పేరుతో పచ్చని చెట్ల తొలగింపుపై స్థానికులు ఆగ్రహం..
- డ్రైనేజీ,తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపణ..
- బౌరంపేట్‌లో పోలీస్ గస్తీ పెంచాలని డిమాండ్..
- వాహనాలు వేగంతో వరుస ప్రమాదాలు..ఇప్పటికే ముగ్గురు మృతి..
- పాఠశాలలు, దేవాలయాల వద్ద తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు బీజేపీ డిమాండ్..



అధికారుల నిర్లక్ష్యంతో, బౌరంపేట్ ఇందిరాగాంధీ విగ్రహం వద్ద వృధాగా పోతున్న త్రాగునీరు..

**దుండిగల్, పెన్ పవర్, జూన్ 20:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని వివిధ శాఖల అధికారుల పనితీరుపై బౌరంపేట్ బీజేపీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ దుండిగల్ సర్కిల్ బౌరంపేట్ డివిజన్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.. మున్సిపల్, వాటర్ బోర్డు, విద్యుత్, పోలీస్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు.. డ్రైనేజీ లీకేజీలు, తాగునీటి పైప్‌లైన్‌ల పగుళ్లు, విద్యుత్ సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు. చెప్పినప్పుడే అయిపోతుందనే సమాధానంతో కాలం గడుపుతున్నారే తప్ప, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని కృష్ణారెడ్డి విమర్శించారు.. బౌరంపేట్ టీ పాయింట్ సర్కిల్‌లో నీరు వృధాగా పోతుందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం అంటూ ఆరోపించారు.. బౌరంపేట్ మూడు తోవ్వల(ఇందిరాగాంధీ విగ్రహం) సమీపంలోని టీ టైమ్ వద్ద విద్యుత్ స్తంభం ఏర్పాటుకు గుంత తవ్విన ప్రాంతంలో వాటర్ లైన్ దెబ్బతిని, గత కొన్ని రోజులుగా వేల లీటర్ల మంచినీరు వృథాగా పోతోందని తెలిపారు. ఆ నీరు రోడ్డు మీదకు రాకపోవడంతో అధికారులు గుర్తించలేదో ఏమోకానీ, ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు..

### బౌరంపేట్‌లో ఇప్పటికే త్రాగునీటి కొరత..

బెంగుళూరు తరహాలో, భూగర్భజలాలు అడుగంటి హైదరాబాద్‌కు కూడా నీటి సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని, కేంద్రం పదే పదే హెచ్చరిస్తున్నప్పటికీ..! సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ఇలా త్రాగునీరు వృధాగా పోతుందని బీజేపీ నేత పీసర కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఇప్పటికే బౌరంపేట్‌లో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని..! ఇలాంటి సమయంలో త్రాగునీటిపై సంబంధిత శాఖలు చర్యలు తీసుకోకపోవడం,వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.. విద్యుత్ స్తంభం ఏర్పాటు కోసం తవ్విన గుంతలో, పైప్‌లైన్ ఉందని గమనించ కుండా, ఈ సమస్యకు కారణమయ్యారని ఆయన ఆరోపించారు.. ఈ సమస్యకు విద్యుత్ శాఖ బాధ్యత వహిస్తుందా..? హెచ్‌ఎండబ్ల్యుఎస్ఎస్‌బి (వాటర్ బోర్డు) స్పందిందిస్తుందా అనే సందిగ్ధ పరిస్థితి నెలకొందని అన్నారు..

### స్పీడ్ బ్రేకర్ల లేమితో ప్రమాదాలు..

గత రెండు సంవత్సరాలుగా బౌరంపేట్‌లో రోడ్ల పరిస్థితి మెరుగుపడిన తర్వాత వాహనాల వేగం పెరిగిందని, దీంతో వరస ప్రమాదాలు అధికమయ్యాయని, ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారని తెలిపారు.. పాఠశాలల నుంచి పిల్లలు బయటకు రావడానికీ, ఇళ్ల నుంచి ప్రజలు రోడ్డుపైకి అడుగుపెట్టడానికీ భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు.. భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో, ప్రభుత్వ పాఠశాల వద్ద, చెరువు రోడ్డులో, ఇందిరమ్మ కాలనీ మార్గంలో, మల్లన్న గుడి మార్కెట్ ప్రాంతంలో, పలు ప్రదేశాల్లో తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ కాలయాపన చేయకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని బౌరంపేట్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు కోరారు. ప్రజా ఆగ్రహానికి గురికాకముందే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బస్తీ బాట పట్టాలని విజ్ఞప్తి చేశారు

### పచ్చని చెట్లు తొలగింపుపై అభ్యంతరం..

అదే ప్రాంతంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు కోసం పచ్చని చెట్లను కూడా తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని ఇప్పటికే సంబంధిత ఏఈకి విజ్ఞప్తి చేసినట్లు స్థానికులు తెలిపారు. మండుటెండల్లో ప్రజలకు నీడనిచ్చే పచ్చని చెట్లను తొలగించడం సరికాదని అన్నారు.. ఇప్పటికే కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో, స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించి, కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకునే చెట్లను తొలగించ కుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని బీజేపీ నేత పీసర కృష్ణారెడ్డి తెలిపారు....










# గురువారెడ్డివి తప్పుడు ఆరోపణలు

- 3 పేజి తరువాయి

మాట్లాడుతూ "వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం స్థలమిచ్చింది. దీన్ని నిర్మించేందుకు నిధుల కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్)ను సంప్రదించగా స్పందించలేదు. కాకా సూచనలతో విశాఖ ఇండస్ట్రీస్ స్పాన్సర్‌షిప్‌కు అంగీకరించింది. ఈ స్పాన్సర్‌షిప్‌ను హెచ్‌సీఏ ఆమోదించి అధికారిక ఒప్పందం చేసుకుంది. ఐపీఎల్ ప్రారంభమైన సమయంలో ప్రకటనల హక్కుల విషయంలో వివాదం తలెత్తగా.. హైకోర్టు, సుప్రీంకోర్టులు విశాఖ ఇండస్ట్రీస్‌కే హక్కులున్నాయని చెప్పాయి. 2011లో హెచ్‌సీఏ ఏకపక్షంగా విశాఖ ఇండస్ట్రీస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయగా ఆర్బిట్రేటర్ విచారణ జరిపి దాదాపు రూ.26 కోట్ల మేర అవార్డు ఇచ్చారు. తర్వాత రూ.17 కోట్లకు సెటిల్ చేసుకోవాలని ప్రతిపాదించడంతో జాయింట్ మెమోకు అంగీకరించాం. హెచ్‌సీఏ ఆ ఒప్పందాన్ని పూర్తి చేయకుండా కోర్టులను ఆశ్రయించింది. చివరకు ఆర్బిట్రేషన్ అవార్డును అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం సిటీ సివిల్ కోర్టులో కేసు కొనసాగుతోంది. మాకు నిధులిచ్చారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నా. లోకాయుక్తలో గురువారెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యం. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ విచారణ కొనసాగుతోంది. గురువారెడ్డికి పరువు నష్టం నోటీసు పంపించాం. అవసరమైతే దావా వేస్తాం. కష్టకాలంలో హెచ్‌సీఏకు అండగా నిలిచిన విశాఖ ఇండస్ట్రీస్‌కు ఒప్పందం ప్రకారం రావాల్సిన హక్కులు, బకాయిలు చెల్లించాల్సిందే. గత 15 ఏళ్లుగా ప్రకటన, ఇతర వాణిజ్య హక్కులను కోల్పోయాం. విశాఖ ఇండస్ట్రీస్ తరపున గతంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్లకు స్పాన్సర్‌షిప్ చేశాం. ఒప్పందం ప్రకారం లభించే నిధులను గ్రామీణ క్రికెట్ అభివృద్ధికే వినియోగిస్తాం" అని వివరించారు.

# పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు. ఆ తర్వాత మేడ్చల్ కోర్టు

14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో, భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.

నిజాంపేట్, బాచుపల్లి పరిధిలోని సుమారు రూ.1000 కోట్ల విలువైన ప్రభుత్వ భూముల విషయంలో, హైకోర్టు తీర్పులపై, రెవెన్యూ అధికారులు ఇప్పటికీ అప్పీళ్లు దాఖలు చేయకపోవడాన్ని ఆకుల సతీష్ తీవ్రంగా ప్రశ్నించారు.. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాచుపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిమాండ్ చేశారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 20:

- బాచుపల్లి మండలంలో రూ. కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమి ప్రైవేటు పరం.?
- హైకోర్టు తీర్పులపై అప్పీళ్లు పెండింగ్ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు..
- నిజాంపేట్‌లో 26 ఎకరాల భూ వివాదం. బాచుపల్లిలో ఆక్రమణలపై చర్యల డిమాండ్
- ప్రభుత్వ భూములు కాపాడాలని స్థానికులతో ఆకుల సతీష్ టీమ్ హెచ్చరిక..
- బాచుపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు ప్ల కార్డుల ప్రదర్శనతో ధర్నా..



బాచుపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ధర్నా..

# హైకోర్టులో అప్పీల్ నిర్లక్ష్యం..!

# రూ.1000 కోట్ల ప్రభుత్వ భూమి ధారాదత్తం..?



ఆకృతి కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్ ఫైల్‌ఫొటో..

- ఒక ప్రభుత్వ భూమికి 4 ఏళ్ళు..! మరోచోట 2 ఏళ్ళుగా అప్పీల్ జాప్యం..!
- భూముల పరిరక్షణకు వెంటనే హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలి: ఆకుల సతీష్..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండల పరిధిలోని సుమారు రూ.1000 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టి, హైకోర్టులో అప్పీల్ పిటిషన్లు దాఖలు చేయాలని ఆకుల సతీష్ డిమాండ్ చేస్తూ..! బాచుపల్లి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట శనివారం ప్ల కార్డులు పట్టుకుని, స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించి, ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు.. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, నిజాంపేట్ గ్రామంలోని సర్వే నెం.325లో ఉన్న సుమారు 14 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ ప్రస్తుతం దాదాపు రూ.600 కోట్లు ఉందని తెలిపారు.. ఈ భూమికి సంబంధించిన Lr.No.B/361/2019 కేసులో హైకోర్టులో W.P. Nos.10920, 11110 అండ్ 11897 of 2020 కేసులలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు వెలువడిందన్నారు.. రెవెన్యూ అధికారులు ఒకవైపు కౌంటర్ దాఖలు చేయలేదని.. మరోవైపు అప్పీల్‌కు వెళ్ళకుండా పరోక్షంగా సహకరించడంపై సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ ప్రభుత్వ భూమి ధారాదత్తంలో హస్తం ఉన్న అధికారులను గుర్తించి బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు..




సర్వే నెం.454 ప్రభుత్వ భూమిగా బోర్డు పెట్టిన అప్పటి ఆర్ఐ భానుచందర్.. ఫైల్‌ఫొటో..


## నిజాంపేట్ సర్వేనెం. 233/23 సబ్ డివిజన్‌లోనూ..

అదేవిధంగా నిజాంపేట్ గ్రామంలోని సర్వే నెం.233/23 నుంచి 233/26 వరకు ఉన్న సుమారు 12 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ రూ.500 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నారు.. ఈ భూమికి సంబంధించిన No.A/1741/2008 కేసులో W.P.M.P. No.3586 of 2014, W.A. S.R. No.191822 శీట 2014 కేసుల్లో ప్రభుత్వ తరపున సమర్ధవంతమైన వాదనలు వినిపించకపోవడం వల్ల ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.. ఈ రెండు కేసుల్లో హైకోర్టు తీర్పులు వెలువడి ఐదు నెలలు గడిచినా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, సంబంధిత రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు అప్పీల్ పిటిషన్లు దాఖలు చేయకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.. అధికారుల వ్యవహారశైలి చూస్తుంటే, ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సతీష్ ఆరోపించారు.. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అధికార పార్టీ నేతలు కూడా ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు..

సుమారు రూ.1000 కోట్ల విలువైన ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు హైడ్రాను కోరారు.. హైకోర్టులో వెంటనే అప్పీల్ పిటిషన్లు దాఖలు చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం జేపీసీగా పోరాడిన ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు స్పందించి భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు..ఈ కార్యక్రమంలో ప్రసాద్, అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, చందు, రంగనాయకులు, ఎల్ల స్వామి, అనుమయ్య, నరోతం రెడ్డి, కవిత రెడ్డి, సాయి నగర్ కృష్ణ, పీబీ శ్రీనివాస్, అంకం సతీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు..

## ఆకృతి కన్‌స్ట్రక్షన్‌లోనూ..! సర్వే నెం.454..

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం సహించరాదని స్పష్టం చేసిన ఆకుల సతీష్, బాచుపల్లి గ్రామంలోని సర్వే నెం.454లో ప్రభుత్వ భూమి, చెరువు కట్ట బఫర్ ప్రాంతాన్ని ఆకృతి కన్‌స్ట్రక్షన్ సంస్థ ఆక్రమించుకుందని ఆరోపించారు.. బాచుపల్లి ఆర్ఐ ప్రభుత్వ హెచ్చరిక బోర్డును పెట్టిన చోటును ఆక్రమించి, ప్రభుత్వ భూమిలో అక్రమంగా రహదారి నిర్మించి వినియోగిస్తున్న వారిపై తక్షణమే చట్టపరమైన, క్రిమినల్ చర్యలు చేపట్టాలని, డిమాండ్ చేశారు. ఆక్రమిత భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగంలోకి తీసుకురావాలని కోరారు..





బాచుపల్లి తహశీల్దార్‌కు శనివారం ఫిర్యాదును అందజేస్తున్న ఆకుల సతీష్ టీమ్..



ప్రభుత్వ భూమి ఆక్రమణలపై అప్పీల్ చేయని భూములు..

గాజులరామారంలో రెవెన్యూ కూల్చివేతలు..




# “బురగరాజ్-సాయిరాజ్” కబ్జాలపై..!

# రెవెన్యూ ‘పంజా’..!

- సర్వే నెంబర్ 342 ప్రభుత్వ భూమిలో 20 అక్రమ నిర్మాణాలు డిమాలిషన్..
- ప్యారా లీగల్ వాలంటీర్ ఫిర్యాదుతో చర్యలకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం..




- గాజులరామామ సర్వే నెంబర్ 342 రాజన్న బస్తీలో 12 అక్రమ నిర్మాణాలు..!
- ఈ 20 అక్రమ నిర్మాణాల వ్యవహారంలో.. ఓ అధికారి హస్తం ఉన్నట్టు సమాచారం..
- కబ్జాదారుడు సాయిరాజ్‌కు సంబంధించిన 8 అక్రమ కట్టడాలను కూల్చేసిన రెవెన్యూ..
- కుత్బుల్లాపూర్ తహాశీల్దార్ రాజేష్ ఆదేశాలతో ఆర్ఐ ఖలీమ్ పర్యవేక్షణలో..
- పోలీసుల భద్రతతో 20 అక్రమ నిర్మాణాలు నేలమట్టం..
- కొత్త ఎమ్మార్వో వచ్చీరాగానే భారీగా కూల్చివేతలపై స్థానికుల హర్షం..

## బురగరాజ్-సాయిరాజ్ కబ్జాలపై రెవెన్యూ ఉక్కు పాదం..

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెంబర్ 342 ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై శనివారం రెవెన్యూ అధికారులు పంజా విసిరారు.. ఓ న్యాయ విద్యార్థి, ప్యారా లీగల్ వాలంటీర్ చేసిన ఫిర్యాదుల ఆధారంగా పరిశీలించిన అధికారులు, తహశీల్దార్ రాజేష్ ఆదేశాలతో, ఆర్ఐ ఖలీమ్ పర్యవేక్షణలో జిపివో ఆధ్వర్యంలో 20 అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్టు అధికారులు తెలిపారు.. సర్వే నెంబర్ 342 ప్రభుత్వ భూమిలో, రాజన్నబస్తీలో కబ్జాదారుడు బురగరాజ్‌కు సంబంధించినవి 12 అక్రమ నిర్మాణాలు.. కైసర్ నగర్ సమీపంలో ఇదే సర్వే నెంబర్‌లోనే కబ్జాదారుడు సాయిరాజ్ 8 అక్రమ కట్టడాలు, పోలీసుల భద్రతతో కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు.. ప్రభుత్వ భూములు కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని కుత్బుల్లాపూర్ తహశీల్దార్ రాజేష్ హెచ్చరించారు.. కూల్చినవి మళ్ళీ నిర్మిస్తే ల్యాండ్ గ్రాబింగ్, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.. హాస్యాస్పద విషయం ఏమిటంటే.. ఈ అక్రమ నిర్మాణ దారులపై కేసునమోదును అధికారులు ప్రస్తావించలేదు.. సాధారణంగానే ఈమధ్యన కూల్చివేతల ప్రక్రియతోనే మమః అనిపిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.






- గాజులరామారం ప్రభుత్వ భూముల్లో పాతుకుపోయిన కబ్జాదారులు..
- సర్వే నెంబర్ 307 ప్రభుత్వ భూమిలో కూల్చినవి మళ్ళీ నిర్మాణాలపై ఫిర్యాదులు..
- కబ్జాదారుడు నర్సింహుడిపై కూడా రెవెన్యూ దృష్టి సారించాలని విజ్ఞప్తి..

గాజులరామారం ప్రభుత్వ భూములు బికారీలను కూడా కుబేరులను చేసాయి.. కబ్జాలు చేయడమే సులువైన పనిగా భావించిన కొందరు, కోట్లకు పడగలెత్తారు.. ఇండికా వి-2 పాత కార్లలో తిరిగిన కబ్జాదారులు “మెర్సిడీజ్ బెంజ్” ఆడీ కార్లలో తిరిగే స్థాయికి చేరుకోగా..! టిప్పర్‌లపై డ్రైవర్‌గా పనిచేసిన వాళ్ళు,ఇప్పుడు ఓనర్లుగా మారారని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.. 2018లో కేవలం నలుగురు ప్రధాన కబ్జాదారులతో ప్రారంభం కాగా..! కుత్బుల్లాపూర్ మండలంలో 2023లో సస్పెండ్ అయిన ఓ ఆర్ఐ ప్రోత్సాహంతో కబ్జాదారుల సంఖ్య మరింతగా పెరిగింది.. అప్పట్లో తన సామాజిక వర్గానికి సంబంధించిన ఓ జిల్లా అధికారి అండతో, కబ్జాదారులకు పూర్తి స్వేచ్ఛను, భరోసా కల్పించారు.. ఒక్కో నిర్మాణానికి రూ.3 లక్షలు ఒప్పందం కుదుర్చుకుని, ఎవరి స్థాయిలో వారి వాటాలు పుచ్చుకుని, కబ్జాదారులకు అండగా నిలిచారు.. దీంతో అప్పటి కలెక్టర్ ఫిర్యాదులపై విచారణ జరిపించారు.. ఈ వ్యవహారంలో కేవలం అక్రమ నిర్మాణాల ముడుపులే సుమారు రూ.70 కోట్లు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.. దీంతో సంబంధిత ఆర్ఐ సహా ముగ్గురు విఆర్ఏలను సస్పెండ్ చేశారు.. ఇదంతా గతంలో కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారుల కథాకమామీషు.. ఇంత జరిగినా అధికారుల తీరు “చింత సచ్చినా.. పులుపు చావదనే” నానుడికి అద్దం పట్టడం కొస మెరుపు..


**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 20:**

ఆర్ఐ ఖలీమ్ పర్యవేక్షణలో కూల్చివేతలు..



మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలోని ప్రభుత్వ భూములపై శనివారం రెవెన్యూ కూల్చివేతలు ఓ ప్రత్యేకతను సంతరించుకుందనే చెప్పవచ్చు.. బహుశా రెవెన్యూ ప్రమేయం లేకుండా హైడ్రా కూల్చివేతల అనంతరం, రెవెన్యూ అధికారుల మరో భారీ కూల్చివేతలు ఇవే కాబోలు.. రూ.వేలకోట్లు విలువైన గాజులరామారం ప్రభుత్వ భూముల కబ్జాలకు రాజకీయ నాయకుల అండ అత్యంత ప్రభావం చూపింది.. సొంతింటి కల నెరవేర్చు కోవడానికి ఎదురు చూస్తున్న, అమాయకులను ఎంచుకుని కబ్జాదారులు కోట్లు కూడగట్టుకున్న విషయం తెలిసిందే.. కూల్చివేతల చేపట్టిన ప్రతిసారీ బాధితులకు, న్యాయం చేయాలనే ఆలోచన, ఏ ఒక్క అధికారికి లేకపోవడం బాధాకరం.. ఇందులో కొంత రెవెన్యూ యంత్రాంగం తప్పిదం లేకపోలేదు.. కబ్జాలను ఎప్పటికప్పుడు అరికడుతూ, చర్యల తోపాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఉంటే, అమాయకులు మోసపోయే వారు కదా..! అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అవును రెవెన్యూ అధికారుల్లో పారదర్శకత కొరవడింది.. నేతల సిఫార్సులకే ప్రాధాన్యత ఇస్తూ, రూ.వేలకోట్లు విలువచేసే ప్రభుత్వ భూములు ధారాదత్తం చేయడం పరిపాటిగా మారింది.. ఈ కబ్జాల వ్యవహారం కుత్బుల్లాపూర్ ఒక్కటే కాదు.. దుండిగల్, బాచుపల్లి మండలాల్లోనూ ఇదే పరిస్థితి.. అవినీతి అధికారులే రాజ్యమేలుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.. అందుకు నిదర్శనమే ఈ అక్రమ నిర్మాణాల బాగోతం..




కూల్చివేతల వద్ద అడ్డుకుంటున్న బాధితులను, పక్కకు తీసుకెళ్తున్న పోలీసులు..

## కూకట్ పల్లి పీఎస్ లో యోగా

**రంగారెడ్డి: పెన్ పవర్:** కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ సుబ్బారావు నేతృత్వంలో పోలీసులకు యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే పోలీసులకు యోగ మానసికంగా శారీరికంగా ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు యోగా చేయాలని సూచించారు. రేపు అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని నేడు స్టేషన్ లో ఉన్న పోలీస్ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు కూడా రోజు పాటించాలని కోరారు.

## ఆన్లైన్ విచారణ కుదరదు.. అల్లు అర్జున్ కోర్టుకు రావాల్సిందే

**హైదరాబాద్ పెన్ పవర్:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మొదటి విచారణకు సోమవారం నాంపల్లి కోర్టులో అల్లు అర్జున్ హాజరు కానున్నాడు. ముంబైలో మూవీ షూటింగ్లో ఉన్నందున ఆన్లైన్ విచారణకు హాజరవుతానన్న అల్లు అర్జున్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఆన్ లైన్ విచారణ కుదరదు. వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలసిందేనని ఆదేశించింది.

## ఇన్స్టాగ్రామ్లో ఫేక్ ఐడీలతో ట్రైనీ ఐపీఎస్ అంటూ యువతులకు వల రూ.14 లక్షలు దోచుకున్న నిందితుడు

**మెదక్: పెన్ పవర్:** మెదక్ జిల్లా టెక్మాల్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో నివసిస్తూ ఇన్స్టాగ్రామ్లో తన పేరు రుత్విక్ రెడ్డిగా మార్చుకుని, ఐపీఎస్ ట్రైనింగ్ తీసుకుంటున్నానని అదే గ్రామానికి చెందిన యువతితో ఉప్పరి దుర్గయ్య పరిచయం పెంచుకున్నాడు. ఖర్చులకు డబ్బులు కావాలని, తననే పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.5 లక్షలు, తులం బంగారం కాజేసాడు. సాత్విక్ రెడ్డి పేరుతో మరో ఐడీ సృష్టించి ఎల్లాస్ పూర్ గ్రామానికి చెందిన ఓ 17 ఏళ్ల బాలికను ట్రాప్ చేసి, ఎంబీబీఎస్ చదువుతున్నానని నమ్మించి రూ.7 లక్షలు కాజేసాడు. దుర్గయ్య ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో మోసపోయామని గ్రహించి బాధిత యువతులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెబల్స్ ఎత్తులు.. దీదీ పై ఎత్తులు

**న్యూఢిల్లీ, జూన్ 20 పెన్ పవర్:** తిరుగుబాటు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు తృణమూల్ కాంగ్రెస్ శుక్రవారం వినతిపత్రం అందజేసింది. రెబల్స్‌పై వేర్వేరుగా మొత్తం 20 అనర్హత పిటిషన్లను ఓం బిర్లాకు అందించినట్టు మమతా బెనర్జీ మేనల్లుడు, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు. తాము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (లో విలీనమయ్యామని, సభలో తమను ఒక ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని రెబెల్ ఎంపీలు చేసిన వాదన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. సమావేశం అనంతరం మాట్లాడిన బెనర్జీ.. రెబెల్ ఎంపీలు అంతకుముందే స్పీకర్‌ను కలిసి తమను తాము ఒక ప్రత్యేక గ్రూపుగా పరిచయం చేసుకున్నారని చెప్పారు."20 మంది స్పీకర్‌ను కలిసి తమను ఒక ప్రత్యేక గ్రూపుగా పరిగణించాలని కోరారు. ఆ తర్వాత, ఆ ఎంపీలు చీజూ× అనే మరో పార్టీలో చేరినట్లు చెప్పుకున్నారని మాకు తెలిసింది.. ఈ గ్రూపు పేరు ఎవరూ వినలేదు.. కనీసం వారు కూడా ఈ పార్టీ పేరు వినలేదు.. పదో షెడ్యూల్‌లోని సెక్షన్ 2 ప్రకారం, ఒక సభ్యుడు స్వచ్ఛందంగా తన అసలు పార్టీ సభ్యత్వాన్ని వదులుకుంటే, అతడు తన సీటును కోల్పోతాడు... కాబట్టి, వారు ఒక పార్టీ గుర్తుపై గెలిచి, రెండేళ్ల తర్వాత కొత్త పార్టీలో చేరుతున్నామని చెబుతుంటే వారు సభ్యత్వాన్ని రద్దు చేయాలి" అని ఆయన అన్నారు. "ఈ పిటిషన్లను వీలైనంత త్వరగా పరిష్కరించాలని మేము డిమాండ్ చేశాం... మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కూడా చెప్పింది" అని అభిషేక్ వ్యాఖ్యానించారుప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు లేదా నాయకుడి నియామకం వంటి రెబల్స్ ఇతర డిమాండ్లను ఆయన ద్వితీయమైనవిగా పేర్కొన్నారు. రెబల్స్ కోరుకుంటే భవిష్యత్ ఎన్నికలలో ఏ పార్టీ టిక్కెట్‌పైనైనా పోటీ చేయవచ్చని, అయితే పార్టీని వీడటం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలను వారు ముందుగా ఎదుర్కోవాలని బెనర్జీ అన్నారు. వారు రాజ్యాంగాన్ని బలహీనపరుస్తున్నారని ఆయన ఆరోపించారు.'వారు పదో షెడ్యూల్‌ను అపహాస్యం చేశారు.. వారు తమ మనస్సాక్షిని, గౌరవాన్ని అమ్ముకున్నారు. బెంగాల్ ప్రజలు వారిని క్షమించరు" అని అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. "వారికి కేంద్ర భద్రత ఉంది. అది పోవాలి. ఎవరూ వారితో నిలబడరు. వారు ఈడీ, సీబీఐలకు భయపడి పార్టీని వీడారు. కోట్లాది రూపాయల ఆశ చూపి, బెదిరింపులతో, భయాలతో ఇలా చేశారు. ఇక్కడ సమాన అవకాశాలు లేవు." అని పేర్కొన్నారుమహారాష్ట్రలోని శివసేనలో ఇటీవల జరిగిన పరిణామాలను కూడా అభిషేక్ ప్రస్తావించారు "మహారాష్ట్రలో శివసేనను విచ్ఛిన్నం చేయడానికి వారు ఎలా ప్రయత్నిస్తున్నారో మనం చూశాం.. వారు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలలో పోటీ చేయడం లేదు. ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేస్తున్నారు" అని బీజేపీపై బెనర్జీ ఆరోపణలు చేశారు.రెబల్స్‌ను ఒక ప్రత్యేక వర్గంగా గుర్తించాలన్న డిమాండ్‌పై నిర్ణయం తీసుకునే ముందు, తన అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ నేతను స్పీకర్ ఆహ్వానించిన నేపథ్యంలో శుక్రవారం ఈ సమావేశం జరిగింది. జూన్ 10న తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఒక ప్రత్యేక వర్గంగా చెప్పుకుంటున్న ఏ గ్రూపునకు కూడా ఎలాంటి గుర్తింపు, హోదా లేదా సౌకర్యం కల్పించవద్దని కోరుతూ బెనర్జీ స్పీకర్‌కు లేఖ రాశారు.ప్రస్తుతం ఉన్న ఒక రాజకీయ పార్టీలోనే మరొక ప్రత్యేక గ్రూపుగా ఏర్పడటానికి రాజ్యాంగం, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అనుమతించవని ఆయన వాదించారు. తృణమూల్ కాంగ్రెస్‌ను ఒకే ఒక రాజకీయ పార్టీగా పరిగణించాలని, సభలో దాని ద్వారా అధికారికంగా నియమించిన నాయకుడు, విప్ ద్వారా మాత్రమే ఆ పార్టీకి ప్రాతినిధ్యం ఉండాలని బెనర్జీ కోరారు. అలాగే ఈ విషయంపై తమ వాదనను వినిపించడానికి పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.మహారాష్ట్ర రాజకీయ సంక్షోభం కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును బెనర్జీ ఇక్కడ ఉదహరించారు. పదో షెడ్యూల్ కింద పార్టీలో చీలిక వచ్చింది అనే వాదనను సమర్థించుకునే అవకాశం ఇకపై లేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత చట్టపరమైన నిబంధనల ప్రకారం ఒకే ఒక రాజకీయ పార్టీని గుర్తించాల్సి ఉంటుందని, అంతే తప్ప పార్టీలోని ప్రత్యర్థి వర్గాలకు గుర్తింపు ఇవ్వడం కుదరదని ఆయన స్పష్టం చేశారు.

## మూడేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

**మేడ్చల్: పెన్ పవర్:** చింతల్ లోని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేపీ వివేకానంద మీడియా సమావేశం నిర్వహించారు. అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మూడేళ్లుగా మోసం చేస్తుందని మండి పడ్డారు. రాష్ట్ర నాయకుల మాట నమ్మకం లేక రాహుల్ గాంధీ ని రాష్ట్రానికి తీసుకొచ్చి రైతులకు డిక్లరేషన్ ఇస్తామని ..అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇవ్వాళ రైతుల ఉసురు తీస్తుంది అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వారి ప్రాణాలను తీస్తుంది. వ్యవసాయం కోసం బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను రద్దు చేసి, రైతుల ను నిండా ముంచినఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది. రైతుబంధు వేయలేక,వ్యవసాయానికి అవసరమైన ఎరువులు ఇవ్వలేక రైతులను మోసం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపించారు.
రైతు బీమా పథకాన్ని ప్రతి ఒక్కరికి అందేలా చేయాలి.లేదంటే రైతుల తరుపున బి ఆర్ ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు.

## ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించిన బీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్: పెన్ పవర్:**రూ.800 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎమ్మార్వో కార్యాలయం కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకులు ముట్టడించారు.బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మన్నె క్రిశాంక్ మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ళలో ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇంటికి పునాది కూడా వేయలేదు.. గత కేసీఆర్ ప్రభుత్వం ఒక కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎన్నో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ రేవంత్ రెడ్డి ఆయన ఎమ్మెల్యేలు ఎక్కడ భూమి కనబడితే అక్కడ కబ్జా చేస్తున్నారు. ఇవాళ ఏకంగా రూ.800 కోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ రూ.5 కోట్లు తీసుకొని గప్ చుప్ ఉన్నాడు. ఏ ఛానల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చర్చకు వస్తారో రావాలి, రూ. 800 కోట్ల ప్రభుత్వ భూమిలో 6000 ఇందిరమ్మ ఇల్లు కట్టే బదులు, కమిషన్ల కోసం షాపింగ్ మాల్ కట్టడానికి కబ్జా ఎలా జరిగిందో చర్చిద్దాం . 2023 19 ఆగస్టులో కబ్జాదారులపై అప్పటి ప్రభుత్వం పోలీసు కేసులు కూడా నమోదు చేసిందని అన్నారు.

## ఆమె పదవి.. ఆయన పెత్తనం..

**హైదరాబాద్ పెన్ పవర్:** వైరా మున్సిపల్ కౌన్సిల్ సమావే శానికి భార్యల వెంట భర్తలు వచ్చారు. ఐదుగురు మునిసిపల్ కౌన్సిలర్ భర్తలు చైర్మన్ భర్త సమావేశంకు హాజరు అయ్యారు. కమిషనర్ రామచంద్రరావు సమావేశంలోచూసి చూడనట్లు వ్యవహరిరడం విశేషం. చైర్మన్ కాప చంద్రకళ, కమిషనర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో 89 అంశాలపై ఎజెండా ప్రవేశ పెట్టగా అందులో అధికార పార్టీ వివక్ష తో 79 అంశాలనుసానుకూల స్పందనతో 11 అంశాలను తిరస్కరించారు. రెండవ సాధారణ సమావేశం నిర్వహించడంతో తమ వార్డులకు నిధులు ఇవ్వడం లేదని మహిళా కౌన్సిలర్ నిలదీసారు. చైర్మన్ భర్త కాప మురళీకృష్ణ జోక్యం చేసుకొని మహిళ కౌన్సిలర్ కు వేలు చూపించి వ్యవహరించడంతో రగడ మొదలయింది.
ఆపై వచ్చిన మిగతా కాంగ్రెస్ మహిళకౌన్సిల్ భర్తలు మండిపడడంతో సమావేశాన్ని ముగించారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఒక్క వారం పాటు బండి భగీరథ్ కు బెయిల్ మంజూరు.. ఏం జరిగిందంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:** పోక్సో కేసులో అరెస్టై దాదాపు నెలరోజులుగా చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్న బండి భగీరథ్‌కు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 28వ తేదీ వరకు.. అంటే సరిగ్గా ఒక్క వారం రోజుల పాటు ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను న్యాయస్థానం ఇచ్చింది. శనివారం జరిగిన విచారణ అనంతరం న్యాయమూర్తి ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. బెయిల్‌కు సంబంధించిన అన్ని షరతులను నిందితుడు తప్పనిసరిగా పాటించాలని కోర్టు స్పష్టం చేసింది.



**అసలు కేసు నేపథ్యం ఏమిటి?**

మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న తీవ్ర ఆరోపణలపై బాధితురాలి తల్లి పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు బండి భగీరథ్‌పై పోక్సో చట్టంలోని పలు కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం మే 16న పోలీసులు ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో ఆయనను అధికారులు చర్లపల్లి జైలుకు తరలించారు.

**హైకోర్టు నిరాకరణ.. పోలీసుల గాలింపు**

అరెస్టుకు ముందే బండి భగీరథ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోరినప్పటికీ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం ఆ పిటిషన్‌ను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. హైకోర్టులో చుక్కెదురు కావడంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో సైబరాబాద్ పోలీసులు రంగంలోకి దిగి ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. భగీరథ్ కోసం లుకౌట్ నోటీసులు కూడా జారీ అయ్యాయి. హైదరాబాద్, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఐదు ప్రత్యేక బృందాలతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు నార్సింగి సమీపంలోని టీజీపీఏ జంక్షన్ వద్ద భగీరథ్‌ను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.

**కోర్టులో ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు**

ఇటీవల భగీరథ్ తరపు న్యాయవాదులు జిల్లా కోర్టులో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. శనివారం ఈ పిటిషన్‌పై ఇరుపక్షాల మధ్య సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. భగీరథ్ తరపు సీనియర్ న్యాయవాది కోర్టులో వాదిస్తూ... ఈ కేసులో తన క్లయింట్‌కు ఎలాంటి ప్రత్యక్ష ప్రమేయం లేదు. రాజకీయ కారణాలతోనే కావాలని ఆయన పేరును ఈ కేసులోకి లాగారు. భగీరథ్ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తారు. ఆయన వల్ల సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఎంతమాత్రం లేదు. కాబట్టి ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. మరోవైపు ప్రాసిక్యూషన్ లాయర్లు కేసు తీవ్రతను, బాధితురాలు మైనర్ అనే అంశాన్ని ప్రస్తావిస్తూ బెయిల్ ఇవ్వొద్దని గట్టిగా వాదించారు.

**కోర్టు తీర్పు.. షరతులు ఉల్లంఘిస్తే అంతే!**

ఇరువర్గాల వాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయస్థానం ప్రస్తుత కేసు పరిస్థితులు, దర్యాప్తు పురోగతి, నిందితుడి పూర్వాపరాలను పరిగణనలోకి తీసుకుంది. చివరకు కొన్ని కఠినమైన షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్‌ను మంజూరు చేసింది. ఈ నెల 28 వరకు

మాత్రమే ఈ తాత్కాలిక బెయిల్ అమల్లో ఉంటుంది. కోర్టు విధించిన నిబంధనలను, షరతులను భగీరథ్ అక్షరాలా పాటించాల్సి ఉంటుంది. ఒకవేళ ఏ ఒక్క షరతును ఉల్లంఘించినా లేదా సాక్షులను బెదిరించడానికి ప్రయత్నించినా బెయిల్ తక్షణమే రద్దయ్యే అవకాశం ఉంటుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ కేసుపై సైబరాబాద్ పోలీసులు తదుపరి దర్యాప్తును వేగవంతం చేశారు.

## ఒక్క ట్వీట్ - మూడు రాష్ట్రాల అలర్ట్

**హైదరాబాద్, జూన్ 20, పెన్ పవర్:**

దేశంలోని స్పేస్-టెక్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు దక్షిణాది రాష్ట్రాల మధ్య సోషల్ మీడియా వేదికగా ఒక అపూర్వమైన వ్యూహాత్మక యుద్ధం నడుస్తోంది. ప్రముఖ అంతరిక్ష సాంకేతిక స్టార్టప్ పిక్సెల్ కో-ఫౌండర్ క్షితిజ్ ఖండేల్వాల్ చేసిన ఒకే ఒక్క పోస్ట్.. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల పారిశ్రామిక మంత్రుల మధ్య హైవోల్టేజ్ పోటీకి తెరలేపింది. బెంగళూరు శివార్లలో తమ ఉపగ్రహాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి భూమిని సేకరించడం ఎంత నరకంగా మారిందో వివరిస్తూ పిక్సెల్ కో-ఫౌండర్ క్షితిజ్ ఖండేల్వాల్ ౹ లో ఒక పోస్ట్ పెట్టారు. భూమిని సేకరించడం కంటే.. అసలు అంతరిక్షంలోకి వెళ్లే ఉపగ్రహాలను తయారు చేయడమే చాలా సులభం అనిపిస్తోంది అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. బెంగళూరు లాంటి గ్లోబల్ టెక్ హబ్‌లో భూసేకరణ, అనుమతుల ప్రక్రియల్లో ఉన్న రెడ్-ట్యాపిజం ను ఈ ట్వీట్ ఎత్తిచూపడంతో పొరుగు రాష్ట్రాలు దీనిని ఒక అద్భుతమైన అవకాశంగా మార్చుకున్నాయి. ఈ పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేష్ అత్యంత వేగంగా స్పందించారు. "క్షితిజ్.. బెంగళూరుకు సరిగ్గా ఆనుకుని, ఇన్వెస్టర్లకు స్వర్గధామం లాంటి అనంతపురం జిల్లా మన పక్కనే ఉంది. అక్కడ మేము స్పేస్ సిటీలు, ఏరోస్పేస్ పార్కులు, రెడీ-టు-గో ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్స్‌ను సిద్ధం చేస్తున్నాం. ఫౌండర్లు భూమి కోసం వేటాడుతూ సమయం వృథా చేసుకోకుండా నేరుగా ఉపగ్రహాల తయారీపై దృష్టి పెట్టవచ్చు. వెల్‌కమ్ టు ఏపీ" అంటూ లోకేష్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. దీనికి మద్దతుగా ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ కూడా కర్ణాటకను టార్గెట్ చేస్తూ.. "కొన్ని ఎకోసిస్టమ్స్ మిమ్మల్ని అనుమతుల కోసం ఆఫీసుల చుట్టూ పరిగెత్తేలా చేస్తాయి.. కానీ ఆంధ్రప్రదేశ్ మీకు నేరుగా లాంచ్ ప్యాడ్ అందిస్తుంది" అంటూ హాట్ కామెంట్స్ జోడించింది. సొంత రాష్ట్రంలోని స్టార్టప్ పొరుగు రాష్ట్రానికి తరలిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన కర్ణాటక భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ వెంటనే రంగంలోకి దిగారు. క్షితిజ్ పోస్టుకు రిప్లై ఇస్తూ.. "నా ఆఫీస్ మరియు అధికారులు తక్షణమే మీతో టచ్‌లోకి వస్తారు. మీ సమస్యలను వ్యక్తిగతంగా సమీక్షించి, భూసేకరణ మరియు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తాం" అని హామీ ఇచ్చారు. బెంగళూరు సిలికాన్ వ్యాలీ ట్యాగ్‌ను కాపాడుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించింది. ఈ బెంగళూరు-ఆంధ్ర వివాదంలోకి తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన అనూహ్యంగా ప్రవేశించారు. హోసూర్ సరిహద్దులో ఉన్న తమిళనాడు ఎందుకు ఈ ప్రాజెక్ట్‌ను దక్కించుకోకూడదని నెటిజన్లు ప్రశ్నించడంతో ఆమె అత్యంత హుందాగా, పవర్‌ఫుల్ కౌంటర్ ఇచ్చారు. తాము గైడెన్స్ తమిళనాడు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఇన్వెస్టర్ వెబ్‌సైట్, ౹, లింక్డ్‌ఇన్, ఈమెయిల్ లేదా కేవలం ఒక చిన్న రెఫరల్.. ఇలా ఏ మార్గంలో క్వెరీ పంపినా, చిన్న ఎంట్రప్రెన్యూర్‌ను కూడా సమానంగా, అత్యంత సీరియస్‌గా తీసుకుంటామని చెప్పారు. భారతదేశంలో ఒకప్పుడు పెట్టుబడుల కోసం ఫౌండర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. కానీ ఈరోజు, ఒక స్టార్టప్ ఫౌండర్ పెట్టిన చిన్న అసంతృప్తి ట్వీట్‌కు ముగ్గురు రాష్ట్రాల మంత్రులు పోటీ పడి మరీ నిమిషాల వ్యవధిలో పరిష్కారాలు చూపడం భారతీయ స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో వచ్చిన విప్లవాత్మక మార్పుకు నిదర్శనం. ల్యాండ్ అక్విజిషన్ , రెడ్-ట్యాపిజం వంటి పాత కాలపు అడ్డంకులను తొలగించి, ఇన్వెస్టర్లకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కల్పించడంలో దక్షిణాది రాష్ట్రాల మధ్య సాగుతున్న ఈ ఆరోగ్యకరమైన పోటీ దేశ ఆర్థిక వృద్ధిని మరింత వేగవంతం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నఅభిప్రాయం వ్యక్తమవుతోంది.

## హై సెక్యూరిటీ జోన్ లలో స్పై కెమెరాలు

**ఛండీఘడ్ జూన్ 20, పెన్ పవర్:**

అమృత్‌సర్‌లోని అత్యంత భద్రతా ప్రాంతాల్లో రహస్యంగా అమర్చిన కెమెరాలు గుర్తించబడ్డాయి. ఈ ప్రాంతాలు సైనిక ఉన్నతాధికారులు తిరిగే ప్రదేశాలు. కెమెరాలు మూడు నెలలుగా పనిచేస్తున్నాయని తెలిసింది. ఇవి సౌరశక్తి (సోలార్ పవర్)తో నడిచే సీసీటీవీ కెమెరాలు. అమృత్‌సర్ నగరం మొత్తాన్ని కవర్ చేసేలా అమర్చబడ్డాయి. ఈ కెమెరాలు రహస్యంగా ఉండేలా డిజైన్ చేయబడ్డాయి, కాబట్టి వాటిని సాధారణంగా గుర్తించడం కష్టం. శత్రువుల చేతికి డేటా.. ఈ కెమెరాలు సిమ్ కార్డుల సాయంతో రికార్డ్ చేసిన దృశ్యాలను నేరుగా పాకిస్తాన్, కెనడాకు పంపుతున్నాయి. ముఖ్యంగా, భారత సైన్యం యొక్క ఎక్స్ కార్ప్స్, హెడ్‌క్వార్టర్స్, సైనిక హౌసింగ్ కాలనీలు, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, విమానాశ్రయం వంటి సున్నితమైన ప్రాంతాలను లైవ్‌గా నిఘా వేస్తున్నాయి. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు ఈ దృశ్యాలను నేరుగా చూస్తున్నట్లు సమాచారం వెల్లడైంది. సోలార్ పవర్ వల్ల కెమెరాలు రాత్రింబగళ్లు పనిచేయగలిగాయి, సిమ్ కార్డులు దూర ప్రాంతాలకు డేటా పంపడానికి సహాయపడ్డాయి. ఇద్దరి అరెస్టు.. ఈ వ్యవహారంలో ఇద్దరు వ్యక్తులను అమృత్‌సర్ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. వారి సహాయంతో కెమెరాలు అమర్చినట్లు, డేటా ప్రసారం చేసినట్లు తేలింది. పోలీసులు ఈ కెమెరాలు ఎలా అమర్చబడ్డాయి, ఎవరి సహాయంతో అనే విషయాలపై విస్తృతంగా విచారణ చేస్తున్నారు. ఈ అరెస్టులు ఈ వ్యవహారాన్ని మరింత లోతుగా పరిశీలించడానికి సహాయపడ్డాయి. ఎలా గుర్తించారు.. ఈ రహస్య కెమెరాలు భద్రతా దళాలు నిర్వహించిన రొటీన్ నిఘా పర్యటనలో గుర్తించబడ్డాయి. సాధారణంగా ఇలాంటి ప్రాంతాల్లో అదనపు పరికరాలు ఉన్నాయేమో అని తనిఖీ చేస్తుంటారు. ఈ కెమెరాలు చిన్నవిగా, రహస్యంగా ఉండటం వల్ల మొదట్లో గుర్తించడం కష్టం అయింది. కానీ సాంకేతిక పరిశీలనలో వాటి ఉనికి బయటపడింది. భద్రతకు సవాల్.. ఈ సంఘటన జాతీయ భద్రతపై తీవ్రమైన సవాల్‌గా మారింది. సైనిక ఉన్నతాధికారుల కదలికలు, ముఖ్యమైన సంస్థలు, విమానాశ్రయం వంటి సున్నితమైన ప్రాంతాలపై రహస్య నిఘా ఏర్పాటు చేయడం అనేది సాధారణ నేరం కాదు. ఇది విదేశీ శక్తులు లేదా ఉగ్రవాద సంస్థలు భారతదేశంలో ఎలా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయో చూపిస్తుంది. సోలార్ పవర్, సిమ్ కార్డుల ఉపయోగం ఈ కెమెరాలను గుర్తించడం కష్టతరం చేసింది. దృశ్యాలు నేరుగా పాకిస్తాన్, కెనడాకు వెళ్లడం అంతర్జాతీయ కోణాన్ని కూడా సూచిస్తుంది. ఇది భారతదేశం యొక్క భద్రతా వ్యవస్థలో లోపాలను బయటపెట్టింది. అయితే, ఈ సంఘటన నుంచి ముఖ్యమైన పాఠం ఏమిటంటే భద్రతా ప్రాంతాల్లో నిరంతర నిఘా, సాంకేతిక పర్యవేక్షణ అవసరం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు, సాంకేతిక సామర్థ్యాలు మెరుగుపరచడం, అంతర్జాతీయ సహకారం పెంచడం, స్థానిక స్థాయిలో అప్రమత్తత పెంచడం అవసరం

# సాయికృష్ణ అదృశ్యం: రాజకీయ వివాదాల వేళ చంద్రబాబు కీలక నిర్ణయం!



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం ఉదంతం కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ప్రభుత్వం ప్రత్యేక విచారణకు ఆదేశించింది. అంతేకాకుండా బాధితులను పిలిపించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షాలు ఈ వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పోలీసులపై తీవ్ర విమర్శలు చేస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా జోక్యం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుందని అంటున్నారు. సాయికృష్ణ అదృశ్యంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా జోక్యం చేసుకున్నారు. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, ఆయన మేనమామలను తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన కుమారుడి అదృశ్యం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించాలని, నిజమైన దోషులను గుర్తించి న్యాయం చేయాలని విజయలక్ష్మి ముఖ్యమంత్రిని కోరారు. ఆమె ఆవేదనను విన్న చంద్రబాబు, ఘటనపై నిష్పక్షపాతంగా, పారదర్శకమైన దర్యాప్తు జరిపిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. బాధితులకు ధైర్యం చెబుతూ, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

సాయికృష్ణ అదృశ్యం వ్యవహారం రాజకీయ వివాదంగా మారడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. సాయికృష్ణ అదృశ్యం వెనుక పోలీసుల హస్తం ఉందని, ఇది లాకప్ డెత్ అని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో కుల ప్రస్తావన తెరపైకి రావడంతో ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి మరింత పెరిగింది. ఇదే అంశంపై స్పందించిన ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, గురువారం సాయంత్రం సాయికృష్ణ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. ప్రతిపక్షం తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న తరుణంలో, ముఖ్యమంత్రి స్వయంగా బాధితులను పిలిపించి మాట్లాడటం రాజకీయంగా కీలక మలుపుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ తర్వాత బాధితులు కూడా సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. "ముఖ్యమంత్రి మా సమస్యను సావధానంగా విన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులను శిక్షించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పిలిపించి మాట్లాడటం మాకు కొంత ఊరటనిచ్చింది, మాకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందనే విశ్వాసం ఉంది" అని సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి పేర్కొన్నారు.


# డీఎస్సీ డ్యామేజ్ ఎవరికి...

**విజయవాడ, జూన్ 20, పెన్ పవర్:**

డీఎస్సీ 2025 విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరోసారి షాక్ తప్పలేదు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియలు అనేక రకాల అవకతవకలు జరిగాయని గత కొద్ది రోజులుగా ఆరోపణలు చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. జగన్మోహన్ రెడ్డి అయితే తన పక్కన డీఎస్సీ అభ్యర్థులను పెట్టుకుని మరి ఆరోపణలు చేస్తూ వచ్చారు. అయితే ఈ విషయంలో అనుకున్న స్థాయిలో వైసీపీకి ప్రజల్లో మైలేజ్ దక్కలేదు. అలా దక్కలేదు సరి కదా తిరిగి డ్యామేజ్ జరిగింది. దానికి కారణం లేకపోలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు మాదిరిగా కూటమి నుంచి ఎదురుదాడి రాలేదు. ఒక పద్ధతి ప్రకారం అధికారులు మీడియా ముందుకు వచ్చి సుదీర్ఘ వివరణలు ఇచ్చారు. ప్రతి అంశంపై స్పష్టత ఇచ్చారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. ఇదంతా రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ప్రయత్నం గా ప్రజలు ఒక అంచనాకు వచ్చారు. అందుకే లైట్ తీసుకుంటున్నారు. మరికొందరైతే అసహ్యించుకుంటున్నారు వైసీపీ తీరుపై. ఎప్పటికప్పుడు స్టాండ్ మార్చుతూ.. డీఎస్సీ విషయంలో వైసిపి ఒక స్టాండ్ తో ముందుకు వెళ్లలేదు. రకరకాల ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. వైసీపీ నుంచి వచ్చిన ఆరోపణలకు కూటమి నేతలు కౌంటర్ ఇచ్చి ఉంటే అది రాజకీయ రగడగా మారి ఉండేది. అందుకే ప్రభుత్వం వ్యూహాత్మకంగా విద్యాశాఖ ఉన్నతాధికారులను

రంగంలోకి దించింది. సాక్షి మీడియాలో వచ్చిన వ్యతిరేక కథనాలను కేస్ స్టడీస్ గా తీసుకుంటూ ఒక్కో అనుమానాన్ని నివృత్తి చేశారు. ఎంతో ఓపికగా అధికారులు సమాధానాలు చెప్పారు. దీంతో ఆదిలోనే దానికి కౌంటర్ ఇవ్వగలిగారు అధికారులు. సోషల్ మీడియాలో అధికారులు ఇచ్చే కౌంటర్ ఎక్కువగా ప్రజల్లోకి వెళ్ళింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. లోకేష్ సవాల్ తో.. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వద్ద ఆధారాలు ఉంటే కచ్చితంగా న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చు అని ప్రభుత్వ వర్గాలు సలహా ఇచ్చాయి. అది కూడా ప్రజల్లోకి వెళ్ళింది. వైసీపీ నేతలు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు అంటూ ప్రజలు ఒక నిర్ధారణకు కూడా వచ్చారు. అక్కడితో ఆగలేదు. మళ్లీ కమ్మ డీఎస్సీ అంటూ చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ కోటాలో కమ్మ సామాజిక వర్గం వారికి అధిక అవకాశాలు కల్పించారు అంటూ ఆరోపణలు చేశారు. దానిని కూడా నివృత్తి చేసింది విద్యాశాఖ. రెడ్డి సామాజిక వర్గానికి 10 పోస్టులు, కాపు సామాజిక వర్గానికి 16 పోస్టులు ఇస్తే కమ్మ సామాజిక వర్గానికి మాత్రం 9 పోస్టులు కేటాయించినట్లు చెప్పుకొచ్చారు. ఆ విషయంలో కూడా ఆ పార్టీకి షాక్ తప్పలేదు. చివరిగా లోకేష్ సాహసించి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుడు చర్యలను తప్పుపడుతూ.. అవసరం అనుకుంటే జగన్మోహన్ రెడ్డి తనతో చర్చకు రావాలంటూ సవాల్ చేశారు. దానికి సై అనలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. లక్ష్మీపార్వతి తో పాటు యాంకర్ శ్యామల లాంటి వారిని పంపించారు. మరోసారి డీఎస్సీ విషయంలో చతికిల పడ్డారు. ఈ మొత్తం పరిణామాలతో ప్రజలు ఒక నిర్ధారణకు వచ్చారు. డీఎస్సీ విషయంలో వైసిపి కుట్ర చేస్తుంది అనే అనుమానాలను ఎక్కువమంది నమ్మారు. అంతిమంగా ఇప్పుడు ఈ డీఎస్సీ అంశం అనేది వైసీపీకి ఎక్కువగా డ్యామేజ్ చేస్తోంది. మున్ముందు వైసీపీ మూల్యం చెల్లించుకోక తప్పదు అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# అపసోపాలు పడుతున్న అమరావతి, పోలవరం



**విజయవాడ, జూన్ 20, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుదు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్ల కాలపరిమితిని పూర్తి చేసుకుంది. గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ప్రధానంగా వినిపించిన నినాదం ఏ అంటే అమరావతి.. పీ అంటే పోలవరం . గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ రెండు ప్రాజెక్టులు రివర్స్ టెండరింగ్, విధానపరమైన నిర్ణయాల వల్ల పూర్తిగా నిర్వీర్యమయ్యాయనే బలమైన విమర్శల మధ్య కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే నాటికి అమరావతి, పోలవరం ప్రాజెక్టులు తీవ్రమైన చట్టపరమైన, ఆర్థికపరమైన, సాంకేతికపరమైన సవాళ్లతో కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనల వల్ల అమరావతిలో దాదాపు 45,000 కోట్ల విలువైన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి అడవిని తలపించాయి. అటు పోలవరంలో గైడ్ బండ్ దెబ్బతినడం, డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు భవితవ్యమే ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం.. మొదటి ఆరు నెలల కాలాన్ని కేవలం నష్ట నివారణ చర్యలు, నిధుల సమీకరణకే కేటాయించాల్సి వచ్చింది. రాజధాని అమరావతిని గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అద్భుతమైన ఆర్థిక పురోగతిని సాధించింది. గత ఐదేళ్ల వైఫల్యాల వల్ల దెబ్బతిన్న అంతర్జాతీయ బ్యాంకుల నమ్మకాన్ని పునరుద్ధరించడంలో చంద్రబాబు విజయవంతమయ్యారు. ప్రపంచ బ్యాంకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ల నుంచి ఉమ్మడిగా 15,000 కోట్ల ప్రత్యేక రుణాన్ని ప్రభుత్వం సాధించింది. ఈ నిధులతో గతంలో ఆగిపోయిన ఐకానిక్ నిర్మాణాలు --- సెక్రటేరియట్ టవర్స్, హైకోర్టు, అసెంబ్లీ భవనాలతో పాటు ఐఏఎస్, జడ్జీల క్వార్టర్ల నిర్మాణ పనులను నూతన ఎల్అండ్‌టీ , షాపూర్జీ పల్లోంజీ సంస్థలకు అప్పగించి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిలో గత రెండేళ్లలో మౌలిక వసతుల కల్పన 45 శాతం మేర పూర్తయింది. గతంలో నిలిచిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. స్టార్టప్ ఏరియా అభివృద్ధి కోసం సింగపూర్ సంస్థలతో పాత ఒప్పందాలను పునరుద్ధరించడమే కాకుండా, దాదాపు 12 జాతీయ, అంతర్జాతీయ ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు అమరావతిలో భూములు కేటాయించడం ద్వారా ఈ రెండేళ్లలోనే సుమారు 8,000 కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించగలిగారు. కూటమి ప్రభుత్వానికి అత్యంత సవాలుగా మారింది పోలవరం ప్రాజెక్టు. గత ప్రభుత్వ హయాంలో గోదావరి వరదల వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను పూర్తిగా పునర్నిర్మించాలా లేదా పాతదానికి మరమ్మతులు చేయాలా అనే సాంకేతిక మీమాంసకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ ద్వారా కూటమి ప్రభుత్వం తెరదించింది. దెబ్బతిన్న పాత డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్తగా దాదాపు 2,000 కోట్ల అంచనా వ్యయంతో నూతన వాల్ నిర్మాణాన్ని రికార్డు సమయంలో ప్రారంభించారు. కేంద్రంలో ఉన్న బీజేపీతో సఖ్యతను ఉపయోగించుకుని, పోలవరం మొదటి దశ పూర్తి చేయడానికి కేంద్ర మంత్రివర్గం ద్వారా 12,157 కోట్ల అదనపు నిధుల ప్యాకేజీని కూటమి

ప్రభుత్వం మంజూరు చేయించుకోగలిగింది. ఈ రెండేళ్ల కాలంలో పోలవరం ప్రధాన డ్యామ్ పనులు, స్పిల్‌వే రేడియల్ గేట్ల అమరిక 85 శాతం పూర్తయింది. కుడి, ఎడమ కాలువల లైనింగ్ పనులు, టన్నెల్ పనులలో గత రెండేళ్లలో 22 శాతం అదనపు పురోగతి నమోదైంది. అత్యంత క్లిష్టమైన 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని పునరావాస ప్రక్రియ కోసం సుమారు 5,000 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఖజానా ఖాళీగా ఉండటం, భారీగా ఉన్న అప్పుల భారం వంటి అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం అమరావతి - పోలవరం ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. గడిచిన రెండేళ్ల డేటాను పరిశీలిస్తే.. ప్రచార ఆర్భాటాల కంటే క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల పునరుద్ధరణ, కేంద్రం నుంచి నిధుల రాకపైనే ప్రభుత్వం ఎక్కువ విజయం సాధించిందని స్పష్టమవుతోంది. సాంకేతిక, చట్టపరమైన అడ్డంకులను అధిగమించి చూపిస్తున్న ఈ పురోగతి.. రాబోయే మూడేళ్లలో ఏపీ అభివృద్ధి రథాన్ని మరింత వేగంగా ముందుకు నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ప్రజలు నమ్మకంతో ఉన్నారు.

## ఆర్థిక ప్రగతిపై లోకేష్ కొత్త రోడ్‌మ్యాప్

**విజయవాడ, జూన్ 20, పెన్ పవర్:** ఏపీలోని టీడీపీ కూటమిలో యువ మంత్రిగా ఉన్న నారా లోకేష్ జాతీయ స్థాయిలో తన పలుకుబడిని మరింతగా పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీ మంత్రిగా ఆయన కేవలం రాష్ట్రానికే పరిమితం కావడం లేదు. అదే సమయంలో ఢిల్లీకి అనేక సార్లు వెళ్ళి వస్తున్నారు. కేంద్ర మంత్రులను విరివిగా కలుస్తున్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా సమావేశం అవుతున్నారు. తాను చురుకైన యువ నేతగా ఏపీ రాజకీయాల్లో ఉన్నాను అని తెలియచేసేందుకు ఈ పర్యటనలు లోకేష్ కి ఎంతగానో దోహదపడుతున్నాయన్న విశ్లేషణలు ఉన్నాయి. కేవలం దేశ రాజధాని ఢిల్లీకి మాత్రమే లోకేష్ పర్యటనలు పరిమితం కావడం లేదు, ఆయన వివిధ రాష్ట్రాలలో కూడా పర్యటిస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాల మీదనే ఈ పర్యటనలు అని ప్రచారం జరుగుతున్నా వాటితో పాటుగా స్వామి కార్యం అన్నట్లు లోకేష్ ఆయా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న నాయకులను ముఖ్యమంత్రులను కలుసుకుంటూ వారితే మమేకం అవుతూ యంగ్ డైనమిక్ లీదర్ గా తనను తాను ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉంటే నారా లోకేష్ తాజాగా పశ్చిమ బెంగాల్ కి వెళ్ళారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారితో కోల్ కతాలో భేటీ అయ్యారు. ఇరువురు నేతలు రెండు రాష్ట్రాలకు సంబంధించిన విషయాలను చర్చించుకున్నారు. ఏపీలో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ గురించి లోకేష్ సువెందుకు తెలిపారు. ఏపీలో అత్యధిక మందికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కూడా చెప్పారు. శిపశ్చిమ బెంగాల్ లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఏపీ బెంగాల్ మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేద్దామని సువేందుని లోకేష్ కోరడం విశేషం. ఇదే సందర్భంలో పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని, తిరుమలలో పశ్చిమ బెంగాల్ భవన్ నిర్మాణానికి అన్ని విధాలా సాయం అందిస్తామని సువేందుకు లోకేష్ విన్నవించారు. ఇంతకు ముందు ముంబై పర్యటనకు వెళ్ళిన నారా లోకేష్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తో కూడా భేటీ అయి అనేక అంశాలను ముచ్చటించారు. ఇలా లోకేష్ బీజేపీలో కీలకమైన రాష్ట్రాలకు చెందిన ఇద్దరు యువ ముఖ్యమంత్రులతో భేటీలు వేయడం రాజకీయంగా ఆసక్తిని కలిగించే అంశంగానే చూస్తున్నారు ఈ ఇద్దరు నేతలూ బీజేపీలో ఎంతో భవిష్యత్తు ఉన్న వారు కావడం విశేషం. ఇక ఏపీ నుంచి రాజకీయంగా ఎదుగుతున్న నేతగా లోకేష్ ఉన్నారు. దాంతో ఆయన జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ బీజేపీ పెద్దలతో పాటు యువ ముఖ్యమంత్రులతోనూ అదే రకమైన సాన్నిహిత్యం నెరపడం వెనక ముందు చూపు ఉందని అంటున్నారు. రానున్న రోజులలో ఆయన ఇదే తీరులో మరెంత మంది ముఖ్యమంత్రులను కీలక నేతలను కలుస్తారు అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది. ఏది ఏమైనా ఏపీకి చెందిన మంత్రిగా ఉన్న లోకేష్ తన పలుకుబడిని జాతీయ స్థాయిలో ఒక క్రమపద్ధతిలో విస్తరించుకుంటున్నారు అన్న మాట అయితే గట్టిగా వినిపిస్తోంది.

**బెంగాల్**

జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేష్ ఏపీ ఆర్థిక ప్రగతిపై సరికొత్త రికార్డు రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కోల్‌కతాలో నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక ప్రత్యేక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా.. ప్రస్తుతం 220 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను భవిష్యత్తులో ఏకంగా 2.4 ట్రిలియన్ డాలర్ల మహా సామ్రాజ్యంగా విస్తరించడమే తమ కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. ఈ అద్భుత వృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలంటూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పారిశ్రామిక దిగ్గజాలు, వ్యాపార వర్గాలకు ఆయన బహిరంగ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు ఏ విధంగా దేశంలోనే అత్యంత అనుకూలమైన గమ్యస్థానంగా మారిందో వివరించడానికి మంత్రి లోకేష్ సరికొత్తగా 3ఎ సూత్రాన్ని తెరపైకి తెచ్చారు. మొదటి 'ఎ' అంటే స్పీడ్ , రెండో 'ఎ' స్టెబిలిటీ , మూడో 'ఎ' సర్వీస్ అని ఆయన అభివర్ణించారు. మీరు మాతో చేతులు కలిపిన మరుక్షణమే.. అది కేవలం మీ ప్రైవేట్ ప్రాజెక్ట్ మాత్రమే కాదు, మా ప్రభుత్వ ప్రాజెక్ట్‌గా మారుతుంది. పారిశ్రామికవేత్తలు దశాబ్దాల తరబడి అనుమతుల కోసం తిరిగే రోజులకు ఏపీలో స్వస్తి పలికాం. స్పీడ్ గవర్నెన్స్ ద్వారా నిర్ణీత కాలంలోనే పనులు పూర్తి చేసి చూపిస్తాం అని లోకేష్ కార్పొరేట్ వర్గాలకు గట్టి నమ్మకాన్ని ఇచ్చారు. ఇదే తరుణంలో జాతీయ స్థాయిలో రాజకీయ స్థిరత్వాన్ని అందిస్తూ, దేశాన్ని సంస్కరణల వైపు నడిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ఈ పర్యటనలో భాగంగా ఐసీసీ సదస్సుతో పాటు కోల్‌కతా కేంద్రంగా ఉన్న పలువురు ప్రముఖ జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించారు. గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలకు చెందిన టాప్ సీఈఓలతో విడివిడిగా భేటీ అయ్యారు. రాబోయే ఐదేళ్లలో ఏపీలో 78.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించేందుకు తెచ్చిన నూతన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ గురించి వారికి వివరించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో భారీ గ్రీన్ ఎనర్జీ హబ్‌ను ప్లాన్ చేస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు.. ఏపీలో ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం, పోర్టు ఆధారిత మౌలిక వసతుల వైపు దృష్టి సారించేలా లోకేష్ తన ప్రతిపాదనలను ముందుంచారు. మంత్రి లోకేష్ ప్రతిపాదించిన ఈ 2.4 ట్రిలియన్ డాలర్ల విజన్, త్రీ ఎస్ ఫార్ములా కోల్‌కతా పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. కేవలం విధానాల ప్రకటనలకే పరిమితం కాకుండా, అమరావతి రాజధాని నిర్మాణం, విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీ స్థాపన, ఐటీ కారిడార్ల విస్తరణ వంటి ప్రత్యక్ష ప్రాజెక్టులను లోకేష్ ఈ పర్యటనలో ప్రొజెక్ట్ చేశారు. ల్యాండ్ అక్విజిషన్ వేగవంతం చేస్తామని, పారిశ్రామికవేత్తలకు ఎర్రటి తివాచీ పరుస్తామని మంత్రి లోకేష్ ఇచ్చిన భరోసాతో బెంగాల్‌కు చెందిన పలు మల్టీనేషనల్ కంపెనీలు త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

## ప్రకాశం వైసీపీకి దిక్కెవరు...



**ఒంగోలు, జూన్ 20, పెన్ పవర్:** వైసీపీకి గట్టి పట్టున్న జిల్లాగా ప్రకాశం జిల్లాకు పేరుంది. అలాంటి జిల్లాలో ఇపుడు ఫ్యాన్ రెక్కలు సరిగ్గా తిరగడం లేదని అంటున్నారు. జిల్లా మొత్తాన్ని నడిపే సమర్ధ నాయకత్వం లేదని అంటున్నారు. గతంలో అయితే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంటి చేత్తో జిల్లా రాజకీయాలను చక్కబెట్టేవారు. ఆయన వైసీపీని వీడి జనసేనలో చేరిపోయారు. దాంతో వైసీపీకి నాయకత్వం కొరత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు ప్రకాశం జిల్లాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ ఇంచార్జిలను అందరినీ ఒకే త్రాటి మీదకు నడిపించే కో ఆర్డినేషన్ లేకుండా పోతోంది అన్న చర్చ సాగుతోంది. జిల్లాలో చూస్తే కూటమి పటిష్టంగా ఉంది. బాలినేని జనసేనలో చేరికతో ఆ పార్టీ కూడా బలం పుంజుకుంది అని అంటున్నారు. ఇటీవల కాలంలో బాలినేనికి పవన్ కళ్యాణ్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దాంతో బాలినేని రాజకీయంగా దూకుడు పెంచుతున్నారు. అది వైసీపీకి ఇబ్బందికరంగా మారుతుందా అన్న చర్చ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని వైసీపీ ఇంచార్జిలు అంతా యాక్టివ్ మోడ్ లో లేరని విమర్శలు విన వస్తున్నాయి. సొంతంగా స్థానిక సమస్యల మీద పోరు సలపడం లేదు అని అంటున్నారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆందోళన మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపిస్తున్నారు అని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రాజ్యసభ సభ్యుడుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి ఎందుకో జిల్లా రాజకీయాల మీద అంతగా ఆసక్తిని చూపించడం లేదని అంటున్నారు. ఇక జిల్లా అధ్యక్షుడుగా జగన్ సన్నిహితుడైన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఆయన ఎక్కువగా తన సొంత నియోజకవర్గం దర్శి ప్రాంతాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. మరో వైపు చూస్తే అధినేత జగన్ ప్రకాశం జిల్లా మీద ఫోకస్ పెట్టి దిశా నిర్దేశం చేయాల్సిందే అని అంటున్నారు. అక్కడ సరైన నాయకత్వాన్ని గుర్తించి ప్రోత్సహించాలని కూడా అంటునారు. నియోజకవర్గాల స్థాయిలో బలమైన నేతలు ఉన్నారని అంటున్నారు. అలాగే పార్టీకి మంచి ఓటు బ్యాంక్ కూడా ఉంది. మరి వీటిని దృష్టిలో ఉంచుకుని పార్టీని బలోపేతం చేసే నేతల కోసమే సెర్చ్ చేయాల్సి ఉంది అని అంటున్నారు. లేకపోతే మాత్రం ప్రకాశంలో వైసీపీ వెలుగులు గత కాలం కాంతులు అన్న తీరుగానే ఉంటాయని కూడా అంటున్నారు. ముఖ్యంగా క్యాడర్ అయితే పూర్తిగా అసంతృప్తితో ఉందని కూడా గుర్తు చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# యూకేలో గ్రూమింగ్ గ్యాంగ్స్‌పై సంచలన నివేదిక!



యునైటెడ్ కింగ్‌డమ్‌లో గత కొన్ని దశాబ్దాలుగా సంచలనం సృష్టించిన గ్రూమింగ్ గ్యాంగ్స్ వ్యవహారం మరోసారి జాతీయ చర్చకు దారితీసింది. ఎంపీ రూపర్ట్ లోవ్ అధ్యక్షతన బాధితుల అనుభవాలు, మీడియా కథనాలు, గత విచారణలు, విజిల్‌బ్లోయర్ల వాంగ్మూలాల ఆధారంగా రూపొందించిన స్వతంత్ర విచారణ నివేదిక తాజాగా వెలువడింది. మొత్తం 219 పేజీల ఈ నివేదికలో బ్రిటన్‌లో దశాబ్దాల పాటు బాలికలపై సంఘటిత లైంగిక దోపిడీ జరిగినట్లు తీవ్ర ఆరోపణలు చేయబడాయి.నివేదిక ప్రకారం.. చాలా చాలా మంది బాలికలు ఈ నేరాలకు బలైనట్లు అంచనా వేయబడింది. బాధితుల్లో అత్యధికులు శ్వేతజాతికి చెందిన మైనర్ బాలికలేనని.. వారిని మోసం చేసి, మత్తు పదార్థాలకు అలవాటు చేసి, లైంగికంగా వేధించి కొన్నిసార్లు మానవ అక్రమ రవాణాకు కూడా గురిచేసినట్లు పేర్కొంది. ఈ సంఘటనలు యూకేలోని అనేక ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగాయని నివేదిక వెల్లడించింది.నిందితుల వివరాలపై కూడా నివేదిక పలు కీలక వ్యాఖ్యలు చేసింది. గ్రూపులుగా జరిగిన చిన్నారుల లైంగిక దోపిడీ కేసుల్లో శిక్ష పడిన వారిలో అధిక శాతం పాకిస్తానీ మూలాలున్న పురుషులేనని నివేదిక పేర్కొంది. అయితే ఈ గణాంకాలు నివేదిక రచయితల విశ్లేషణ ఆధారంగా వెల్లడించబడినవే. ఈ అంశంపై గతంలో కూడా యూకేలో తీవ్ర రాజకీయ, సామాజిక చర్చలు జరిగాయి.ఈ వ్యవహారంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యమని నివేదిక విమర్శించింది. పోలీసులు, స్థానిక కౌన్సిళ్లు, సామాజిక సేవా సంస్థలు, ఆరోగ్య శాఖ, పాఠశాలలు, ప్రాసిక్యూషన్ వ్యవస్థలు అనేక సందర్భాల్లో బాధితుల ఫిర్యాదులను సరిగా పట్టించుకోలేదని ఆరోపించింది. కొన్నిసార్లు బాధితులనే తప్పుబట్టడం, నిందితులపై వెంటనే చర్యలు తీసుకోకపోవడం, ఆధారాలను సరిగా సేకరించకపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొంది.నివేదికలో మరో వివాదాస్పద అంశం మతపరమైన ప్రేరణలపై చేసిన వ్యాఖ్యలు. కొంతమంది నిందితులు తమ చర్యలకు మతపరమైన భావజాలాన్ని ఆధారంగా చూపినట్లు బాధితుల వాంగ్మూలాల్లో పేర్కొన్నప్పటికీ ఈ విశ్లేషణను అందరూ అంగీకరించడం లేదు. విమర్శకులు వ్యక్తుల నేరాలను మొత్తం ఒక మతానికి ఆపాదించడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు.

గతంలో రోదర్‌హామ్, టెల్‌ఫోర్డ్ వంటి ప్రాంతాల్లో జరిగిన అధికారిక విచారణలు కూడా వేలాది మంది బాలికలు లైంగిక దోపిడీకి గురైనట్లు నిర్ధారించాయి. తాజా నివేదిక ఈ ఘటనల పరిమాణం ఇప్పటివరకు భావించిన దానికంటే మరింత పెద్దదిగా ఉండొచ్చని పేర్కొంటూ పూర్తి స్థాయి పారదర్శక విచారణ, బాధ్యులపై కఠిన చర్యలు, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది.

అయితే ఈ నివేదిక ఒక స్వతంత్ర విచారణ కమిటీ రూపొందించినదే గానీ యూకే ప్రభుత్వ అధికారిక తుది నివేదిక కాదని గుర్తుంచుకోవాలి. ఇందులోని పలు వ్యాఖ్యలు, ముఖ్యంగా మతపరమైన ఉద్దేశాలు, గణాంకాలపై చేసిన విశ్లేషణలు ప్రస్తుతం యూకే రాజకీయాల్లో, సమాజంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

# గ్లోబల్ బ్రాండ్ గా 'జియో'.. భారీ ఐపీవోతో తొలి అడుగు?




దేశ టెలికం రంగంలో పెను సంచలనానికి కారణమై.. ప్రజల జీవితాల్ని పూర్తిగా మార్చేసిన సంస్థగా జియోను చెప్పాలి. కారుచౌకగా డేటాను అందించటం ద్వారా సామాన్యుడు సైతం సాంకేతికంగా ఒక అడుగు ముందుకు వేసేలా చేయటంలో రిలయన్స్ జియో సక్సెస్ అయ్యిందని చెప్పాలి. టెలికం సేవల్లో అనేక సంచలనాలకు తెర తీసిన జియో.. ఇప్పుడు డిజిటల్ సేవలతో పాటు.. మరిన్ని కొత్త రంగాల్లో అడుగు పెట్టేందుకు వీలుగా భారీ విస్తరణ కార్యక్రమానికి తెర తీసింది. ఇందులో భాగంగా శాటిలైట్ కమ్యూనికేషన్స్ రంగంలోకి అడుగు పెడుతున్న జియో.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. క్లీన్ ఎనర్జీ.. కన్జూమర్ వ్యాపారాల్లో భారీ ప్లానింగ్ కు రిలయన్స్ తెర తీసినట్లుగా చెప్పాలి.

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జియో భారీ ఐపీవోకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థగా జియో సుపరిచితం. దీని ప్లాట్ ఫామ్స్ డైరెక్టర్ల బోర్డు భారీ ఐపీవోకు ఓకే చెప్పటం.. అందుకు తగ్గట్లే సెబీకి తమ భారీ ముసాయిదా పత్రాల్ని సెబీకి సమర్పించటం లాంటివి జరిగిపోయాయి. ఇదే విషయాన్ని రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సగర్వంగా ప్రకటించారు. ఈ ఐపీవో ప్రత్యేకత ఏమంటే.. దేశంలోనే అతి పెద్ద ఐపీవోగా రికార్డు క్రియేట్ చేయనుంది. రూ.10 ముఖ విలువ కలిగిన జియో షేర్ ను ఏకంగా 27 కోట్ల మేర జారీ చేయనున్నారు. ఈ భారీ ఐపీవో ద్వారా జియో రూ.37,700 కోట్లను సమీకరించనుంది. ఇప్పటికే ఈ భారీ ఐపీవో గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో.. తాను అనుకున్న లక్ష్యానికి చేరే విషయంలో జియో సక్సెస్ అవుతుందని భావిస్తున్నారు. తాజాగా జియో మార్కెట్ విలువ దగ్గర దగ్గర రూ.13 లక్షల కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఈ భారీ ఐపీవో ప్రత్యేకత ఏమంటు ఇప్పటివరకు దేశంలో రూ.27,870 కోట్లతో హుందాయ్ అతి పెద్ద ఐపీవోకు వచ్చిన సంస్థగా నిలిచింది. ఈ మధ్యనే ఎన్ఎస్ఈ రూ.30వేల కోట్ల ఐపీవో కోసం సెబీకి దరఖాస్తు చేసింది. ఇది జరిగిన రోజుల వ్యవధిలోనే జియో ఐపీవోకు వస్తున్నట్లుగా ప్రకటించటమే కాదు.. దీని ద్వారా ఏకంగా రూ.37వేల కోట్లకు పైనే నిధులు సమీకరిస్తామని చెప్పటంతో ఇప్పటివరకు ఉన్న రికార్డుల్ని చెరివేసేలా జియో గ్రాండ్ గా ఐపీవోకు రానున్నట్లు చెప్పాలి.2008 తర్వాత రిలయన్స్ గ్రూప్ నుంచి వస్తున్న తొలి ఐపీవోగా దీన్ని చెప్పాలి. 2016లో సేవలు షురూ చేసిన జియో.. పదేళ్ల వ్యవధిలో దేశ టెలికం రూపురేఖల్ని సమూలంగా మార్చేసిందని చెప్పాలి. భారత్ లో మొబైల్ డేటా విప్లవాన్ని తీసుకురావటమే కాదు.. సామాన్యుడి దినచర్యను పూర్తిగా మార్చేసింది. టెలికం సేవలతో మొదలు పెట్టి.. క్లౌడ్ సర్వీసులు.. ఎంటర్ ప్రైజ్ సొల్యూషన్లు.. ఏఐ ఇలా వివిధ రంగాల్లో విస్తరించటం ద్వారా పూర్తిస్థాయి డిజిటల్ టెక్నాలజీ సంస్థగా అవతరించింది.ఏఐ కార్యకలాపాల కోసం 2026 నుంచి రానున్న ఏడేళ్ల కాలంలో దాదాపు రూ.10 లక్షల కోట్లను ఖర్చు చేస్తామని ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఇప్పటికే జియో లో మెటా.. గూగుల్.. కేకేఆర్.. జనరల్ అట్లాంటిక్ లాంటి దిగ్గజ సంస్థలు 20 బిలియన్ డాలర్లకు పైనే పెట్టుబడులు పెట్టాయి. ప్రస్తుతం జియో ప్లాట్ ఫామ్స్ లో ఆర్ ఐఎల్ కు 66.43 శాతం వాటా ఉండగా.. మెటాకు 9.99 శాతం.. గూగుల్ 7.73 శాతం వాటాలు కలిగి ఉన్నాయి. ప్రతి భారతీయుడికి ఏఐని అత్యంత చౌకగా అందించటమే తమ లక్ష్యంగా ఆకాష్ అంబానీ పేర్కొన్నారు. మొబైల్ డేటా విప్లవం మాదిరే ఏఐలోనూ విజయం సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. భారత్ కోసం భారత్ ద్వారా రిలయన్స్ రూపొందిస్తున్న ఏఐతో భవిష్యత్తులో ప్రపంచానికి కూడా సేవలు అందించనున్నట్లుగా చెప్పిన ఆకాష్ మాటలు చూస్తుంటే.. రానున్న రోజుల్లో జియో గ్లోబల్ బ్రాండ్ గా అవతరిస్తుందా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. అదే నిజమైతే.. అందుకు త్వరలో వచ్చే ఐపీవో కీలక అడుగుగా మారుతుందని చెప్పక తప్పదు.

# ఫామ్ హౌస్ లో పాముతో ఆట.. వ్యాపారి మృతి

పాము చిన్నదే కావొచ్చు. దానికి ఉండే విషం అత్యంత ప్రమాదకరమైనది. చిన్నపాము అయినా పెద్ద కర్రతో కొట్టాలన్న సామెత.. వేరే సందర్భానికి సూట్ అయ్యేలా చెప్పినా.. తాజా విషాద ఉదంతాన్ని చూసినప్పుడు విషసర్పాలు సైజులో చిన్నగా ఉన్నా.. పెద్దగా ఉన్నా.. ప్రాణం పోయే ప్రమాదం ఉంటుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. పాముల గురించి పూర్తి అవగాహన ఉన్న వారు మాత్రమే ఏ పాములో విషం ఉంటుంది? దేనిలో ఉండదు? సదరు పాము కాటేసినా ప్రమాదం ఉండదన్న విషయాన్ని చెప్పగలుగుతారు. సాదాసీదా వ్యక్తులకు ఆ అవగాహన ఉండదు. అదే సమయంలో మితిమిరీన ఆత్మవిశ్వాసం ప్రాణాలు పోయే పరిస్థితిని తెస్తుంది. ఇందుకు తగ్గట్లే హైదరాబాద్ కు చెందిన ఒక యువ వ్యాపారి మొయినాబాద్ ఫామ్ హౌస్ లో సన్నిహితులతో వెళ్లి.. అక్కడ కనిపించిన ఒక చిన్న పాముతో ఆడిన ఆటలు అతడి ప్రాణాలు పోయేలా చేయటమే కాదు.. అతడ్నే నమ్ముకున్న భార్య.. ముగ్గురు పిల్లల భవిష్యత్తు మీద ఎప్పటికి తొలగని అనిశ్చితికి గురి చేసేలా చేశారు. ఈ సంఘటన నేర్పే పాఠం ఏమంటే.. తాము చేసే పనులు తమను మాత్రమే కాదు.. తమ మీద ఆధారపడిన వారిని ఎంతటి నష్టాన్ని కలిగిస్తాయన్న విషయాన్ని స్పష్టం చేస్తాయి. అయ్యో అనిపించే ఈ విషాద ఉదంతం సోషల్ మీడియాలో ఒక చిట్టి వీడియో వైరల్ గా మారి.. పలువురిని షాక్ కు గురి చేసింది. సోషల్ మీడియా రిపోర్టర్ ఇమ్రాన్ అనే వ్యక్తి 'జోక్ గాన్ రాంగ్' (ప్రాణం తీసిన సరదా) శీర్షికతో చేసిన చిన్న వీడియో వైరల్ గా మారింది. ఒక మధ్య వయస్కుడు పాముతో ఆటలు ఆడటం.. అది కాటు వేయటంతోకాసేపటికి ప్రాణాలు కోల్పోయిన వైనాన్ని పేర్కొన్నారు. సదరు వీడియోలో ఒక యువకుడు పాముతో ఆటలు ఆడుతూ.. పాములంటే తనకు ఏ మాత్రం భయం లేదన్న విషయాన్ని చెప్పే ప్రయత్నంలో.. తన చుట్టూ ఉన్న సన్నిహితులను ఆ చిన్ని పాముతో భయపెట్టే ప్రయత్నం చేసిన వైనం కనిపిస్తుంది. ఈ క్రమంలో ఆ చిన్న పాము కాటేయటం.. అదేమాత్రం ప్రమాదకరం కాదన్నట్లుగా వదిలేయటం.. దాని విషం ఆటలు ఆడిన వ్యక్తి శరీరంలోకి చేరి.. ఆరోగ్య పరిస్థితి విషమంగా మారటంతో హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆలస్యం కావటం.. ప్రాణాలు కోల్పోయిన వైనం షాక్ కు గురి చేస్తుంది. సోషల్ మీడియా రిపోర్టుతో పాటు స్థానిక పోలీసు అధికారుల అందిస్తున్న సమాచారం ప్రకారం చూస్తే.. హైదరాబాద్ లోని లంగర్ హౌస్ ప్రాంతానికి చెందిన 37 ఏళ్ల సయ్యద్ ఖుమైజ్ మొహిద్దీన్ హుస్సైనీ వ్యాపారం చేస్తుంటాడు. తాజాగా వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం పరిధిలోని ఒక ఫాంహౌస్ కు సన్నిహితులు.. స్నేహితులతో కలిసి వెళ్లారు. గురువారం తెల్లవారుజాము ప్రాంతంలో వాష్ రూమ్ కు వెళ్లటానికి బయటకు వచ్చిన అతడికి అక్కడో చిన్న పాము కనిపించింది. దాన్ని సరదాగా పట్టుకొని.. ఆడుకుంటూ.. చుట్టు ఉన్న సన్నిహితుల దగ్గరకు తీసుకొస్తూ భయపెట్టే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో సదరు పాము అతడి కుడిచేతి బొటనవే లిని గట్టిగా కాటేసింది. కొన్ని జాతి విషసర్పాలు కాటేసినప్పుడు పెద్దగా నొప్పి ఉండదు. కానీ.. దాని విషం మాత్రం ప్రమాదకరంగా శరీరంలోకి చేరి ప్రాణాలు తీసే వరకు వెళుతుంది. తాజా ఉదంతంలోనూ అదే జరిగింది. పాము కాటు వేసిన తర్వాత అతడి స్నేహితులు వారించే ప్రయత్నం చేసినా..

నొప్పి లేకపోవటంతో సీరియస్ గా తీసుకోలేదు. కాసేపటికి అతడి శరీరంలో మార్పులు రావటంతో హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లారు.అయితే.. అప్పటికే పాము విషం శరీరంలోకి బాగా చేరిపోవటంతో అతడి ప్రాణాల్ని వైద్యులు కాపాడలేకపోయారు. బాధితుడికి భార్య.. ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. పాము లాంటి విష సర్పాల విషయంలో తెలిసి తెలియన ఆడే ఆటలు ప్రాణాలు తీస్తాయన్న విషయాన్ని మర్చిపోకూడదని తాజా విషాద ఉదంతం స్పష్టం చేస్తుందని చెప్పాలి.

# ఇరాన్‌లో హిజాబ్ నియమాల ఉల్లంఘన.. సింగర్‌కు ఊహించని శిక్ష!



ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీ ఎంతో ముందుకు వెళ్తున్నా, కొన్ని దేశాల్లో మాత్రం మహిళలపై ఉండే కఠినమైన ఆంక్షలు ఇంకా మధ్యయుగాల నాటి కాలంలోనే ఆపేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ దేశంలో హిజాబ్ విషయంలో ఎంత కఠినమైన రూల్స్ ఉంటాయో మనందరికీ తెలిసిందే. తాజాగా అక్కడ హిజాబ్ ధరించకుండా, స్లీవ్‌లెస్ డ్రెస్ వేసుకుని పాట పాడినందుకు ఒక ప్రముఖ యువ మహిళా సింగర్‌కు అక్కడి కోర్టు ఏకంగా 74 కొరడా దెబ్బల భయంకరమైన శిక్షను విధించి ప్రపంచాన్నే ఉలిక్కిపడేలా చేసింది.

**ఆ ఒక్క వీడియో తెచ్చిన ముప్పు:**

ఇరాన్‌కు చెందిన 29 ఏళ్ల ప్రముఖ సింగర్, మ్యూజిక్ కంపోజర్ పరాస్తూ అహ్మది కి అక్కడి ఇస్లామిక్ పాలకులు ఈ షాకింగ్ శిక్షను ఖరారు చేశారు. 2024 డిసెంబర్‌లో ఆమె హిజాబ్ లేకుండా యూట్యూబ్‌లో లైవ్‌స్ట్రీమ్ చేసిన ఒక మ్యూజిక్ కాన్సెర్ట్ ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల కొద్దీ వ్యూస్ సాధించి విపరీతంగా వైరల్‌గా మారింది. ఇక ఆ వీడియోలో ఆమె ఇరాన్ దేశంలో ఎంతో ప్రాచుర్యం పొందిన, విప్లవ గీతం లాంటిదైన 'ఫ్రమ్ ద బ్లడ్ ఆఫ్ ద యూత్ ఆఫ్ ద హోమ్‌ల్యాండ్' అనే పాటను ఆలపించారు.

**74 కొరడా దెబ్బలతో పాటు జైలు ఆంక్షలు:**

ఆమె హిజాబ్ లేకుండా స్లీవ్‌లెస్ డ్రెస్ వేసుకుని పాట పాడటం సోషల్ మీడియాలో వైరల్ అయిన వెంటనే ఇరాన్ అధికారులు అప్పట్లోనే ఆమెను, ఆమెతో పాటు ఉన్న ముస్లిం మ్యూజిషియన్లను అదుపులోకి తీసుకున్నారు. ఇక ఆ తర్వాత డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ ద్వారా ఇస్లామిక్ విలువలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ సైబర్, క్రిమినల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తాజా తీర్పు ప్రకారం పరాస్తూ అహ్మదికి 74 కొరడా దెబ్బల శిక్షతో పాటు, రెండేళ్ల పాటు దేశం విడిచి వెళ్లకుండా ట్రావెల్ బ్యాన్ విధించారు. అలాగే రెండేళ్ల వరకు ఎలాంటి మ్యూజిక్ షోలు చేయకూడదని కోర్టు ఆంక్షలు పెట్టింది.

**ఎనిమిది మంది మ్యూజిషియన్లకు కూడా అదే శిక్ష:**

ఇరాన్‌లో చట్టం ప్రకారం మహిళలు హిజాబ్ లేకుండా బయట ఎక్కడా కనిపించకూడదు. ఈ రూల్స్ సామాన్యులకే కాదు సెలబ్రిటీలకైనా ఒకేలా వర్తిస్తాయి. ఈ కేసులో విచిత్రం ఏంటంటే.. కేవలం సింగర్ పరాస్తూ మాత్రమే కాకుండా, ఆ మ్యూజిక్ ప్రొడక్షన్, రికార్డింగ్‌లో పాల్గొని ఆమెకు సపోర్ట్ చేసిన మరో ఎనిమిది మంది సహ సంగీతకారులకు కూడా ఇరాన్ కోర్టు ఇదే 74 కొరడా దెబ్బల కఠిన శిక్షను ఖరారు చేయడం గమనార్హం. ఒక చిన్న హిజాబ్ రూల్ పాటించలేదనే కారణంతో, కేవలం ఒక పాట పాడినందుకు ఒక మహిళా కళాకారిణిపై ఇంత ఘోరమైన శిక్షలు వేయడం నిజంగా హృదయవిదారకం. ఇక ఇరాన్ పాలకుల కఠిన చట్టాల తీరుపై, అక్కడ సామాన్యుల నుండి సెలబ్రిటీల వరకు మహిళలకు స్వేచ్ఛ లేని పరిస్థితిపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరి ఈ కఠినమైన రూల్స్ ఇరాన్ యువత భవిష్యత్తును ఎటువైపు తీసుకెళ్తాయో చూడాలి.

# NTA తప్పుల మీద తప్పులు.. నాగపూర్ విద్యార్థికి అబుదాబిలో పరీక్ష కేంద్రం!



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) తీరుపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒకసారి రద్దైన నీట్ పరీక్షను ఎంతో పకడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్టీఏపై ఉంది. కానీ, ఆ సంస్థ చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. ఆదివారం జరగబోయే 'రీ-నీట్' పరీక్ష కోసం ఇప్పటికే సర్వం సిద్ధం చేశామని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ఎన్టీఏ అధికారులు పదేపదే చెబుతున్నారు. అయితే, వాస్తవంలో ఎక్కడో ఒక చోట తీవ్రమైన లోపాలు బయటపడుతూనే ఉన్నాయి. దీనికి తాజా ఉదాహరణ, నాగ్‌పూర్‌కు చెందిన అబ్దుల్ మహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థికి ఎదురైన చేదు అనుభవం. ఆ విద్యార్థి నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం ఎంచుకోగా, ఆయనకు దేశం అవతల ఏకంగా అబుదాబిలో పరీక్ష కేంద్రం కేటాయించారు. ఈ ఘటన ఎన్టీఏ నిర్లక్ష్యానికి పరాకాష్ట అంటూ తల్లిదండ్రులు మండిపడుతున్నారు. స్థానిక విద్యార్థి విదేశాల్లో పరీక్ష ఎలా రాయగలడనే కనీస స్పృహ లేకుండా అడ్మిట్ కార్డు జారీ చేయడం ఆ సంస్థలోని వ్యవస్థాగత లోపాలకు అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక పొరపాట్లంటూ ఇలాంటి తప్పిదాల నుంచి బయటపడేందుకు సాకులు వెతుకుతున్న ఎన్టీఏ, విద్యార్థుల ఆవేదనను మాత్రం గుర్తించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇది కేవలం ఒక విద్యార్థికి జరిగిన అన్యాయం కాదని, దేశవ్యాప్తంగా అనేక చోట్ల ఇలాంటి గందరగోళాలు కోకొల్లలుగా వెలుగుచూస్తున్నాయని చెబుతున్నారు. గతంలో జరిగిన పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ, అస్తవ్యస్తంగా పరీక్ష కేంద్రాల కేటాయింపు, ఫలితాల ప్రకటనలో గ్రేస్ మార్కుల గోల్‌మాల్ వంటి సంఘటనలు ఎన్టీఏ సామర్థ్యంపైనే అనుమానాలను రేకెత్తించాయి. ఇలాంటి ఘటనల నుంచి పాఠాలు నేర్చుకోకుండా మళ్లీ అదే తరహాలో తప్పులు చేయడం ఆ సంస్థ వైఫల్యానికి నిదర్శనం అంటూ తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఒకవైపు తమ భవిష్యత్తు కోసం లక్షల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి సిద్ధమవుతుంటే, అడ్మిట్ కార్డుల జారీలో కూడా ఇలాంటి నిర్లక్ష్య ధోరణి పిల్లలను మరింత ఒత్తిడికి గురిచేస్తోందని చెబుతున్నారు. నీట్ వంటి కీలకమైన పరీక్ష నిర్వహణలో ఎన్టీఏ నిరంతరం వార్తల్లో నిలుస్తూ, విద్యార్థుల సహనాన్ని పరీక్షిస్తోందని అంటున్నారు. కేవలం నాగ్‌పూర్ ఘటన మాత్రమే కాదు, పరీక్షా కేంద్రాల మార్పు, సమయపాలనలో లోపాలు, అభ్యర్థుల వివరాల నమోదులో తప్పులు ఇలా ప్రతి దశలోనూ ఎన్టీఏ విఫలమవుతోందని చెబుతున్నారు. పరీక్ష పారదర్శకతపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ, ఇలాంటి చిన్న చిన్న పొరపాట్లు మొత్తం విద్యా వ్యవస్థపైనే నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని అంటున్నారు.

సాంకేతిక లోపాలు ఎన్టీఏకు అలవాటుగా మారిపోయాయని, వీటిని సరిదిద్దడంలో సంస్థ పూర్తిగా విఫలమైందని నిపుణులు విమర్శిస్తున్నారు. ఆదివారం జరగబోయే పరీక్షలోనైనా ఎన్టీఏ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తుందా? లేదా ఇదే తరహా గందరగోళాన్ని కొనసాగిస్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిందని అంటున్నారు. ఏది ఏమైనా, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ఎన్టీఏ తీరుపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సి ఉందని డిమాండ్ వినిపిస్తోంది.

# EPFOకి షాక్: PF రికవరీ నోటీస్ రద్దు.. రిటైర్డ్ ఉద్యోగికి తెలంగాణ హైకోర్టు ఊరట

రిటైర్ అయ్యాక చేతికి రావాల్సినరాఖీ సొమ్ము సకాలంలో అందితే ఆ సంతోషమే వేరు. అయితే అలా అందిన సొమ్మును మళ్లీ వెనక్కి ఇచ్చేయండి అంటూ ప్రభుత్వ సంస్థ నోటీసు ఇస్తే ఎలా ఉంటుంది? సరిగ్గా ఇలాంటి ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొన్నాడు ఒక విశ్రాంత ఉద్యోగి. ఈ వివాదంలో తెలంగాణ హైకోర్టు ఉద్యోగికి అనుకూలంగా సంచలన తీర్పునిచ్చింది. కంపెనీ తప్పు చేస్తే ఆ సొమ్మును ఉద్యోగి నుంచి రికవరీ చేయడం కుదరదని స్పష్టం చేసింది.




**అసలు కేసేంటి?**

జె.వి. నృపేందర్ రావు అనే ఉద్యోగి 2023లో రిటైర్ అయ్యారు. ఆ సమయంలో ఆయనకు రావాల్సిన పీఎఫ్ బ్యాలెన్స్ నుంచి రూ.2 కోట్ల 50లక్షలను కంపెనీ చెల్లించింది. మరో రూ.70 లక్షలు రావాల్సి ఉండగా.. ఆ కంపెనీ పీఎఫ్ ట్రస్ట్ ఆ నిధులను యస్ బ్యాంక్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయడం వల్ల, ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం ఆ డబ్బు ఫ్రీజ్ అయి ఆగిపోయింది. ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. సదరు కంపెనీ అంతకుముందు వరకు మినహాయింపు పొందిన పీఎఫ్ ట్రస్ట్ హోదాలో ఉండేది. కానీ మార్చి 1, 2023 నుండి ఆ హోదాను సస్పెండ్ చేయబడింది.

రూల్స్ ప్రకారం ట్రస్ట్ హోదాను వదులుకున్నాక కంపెనీ తన వద్ద ఉన్న మొత్తం పీఎఫ్ నిధులను ఈపీఎఫ్ఓ ఖాతాకు ట్రాన్స్ఫర్ చేయాలి కానీ నేరుగా ఉద్యోగులకు ఇవ్వకూడదు. అయితే ఈ కంపెనీ మాత్రం ట్రస్ట్ హోదా వదులుకున్నాక జూలై 2023లో నృపేందర్ రావుకు రూ.2కోట్ల 50లక్షలు చెల్లించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఈపీఎఫ్ఓ.. ఫిబ్రవరి 17, 2025న నృపేందర్ రావుకు రికవరీ నోటీసు పంపింది. కంపెనీ చట్టాన్ని ఉల్లంఘించిందని.. కాబట్టి ఆ రూ.2కోట్ల 50లక్షలను 12% వడ్డీతో కలిపి 7 రోజుల్లోగా వెనక్కి కట్టాలని ఆదేశించింది. దీంతో ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.

**హైకోర్టు తీర్పు.. ఎందుకలా అంది?**

ఈ కేసును విచారించిన జస్టిస్ నాగేష్ భీమపాక నేతృత్వంలోని హైకోర్టు బెంచ్.. ఈపీఎఫ్ఓ ఇచ్చిన రికవరీ నోటీసును పూర్తిగా రద్దు చేసింది. కోర్టు తన తీర్పులో కొన్ని కీలక విషయాలను ప్రస్తావించింది:

ఉద్యోగి తప్పు లేదు: కంపెనీ లేదా దాని పీఎఫ్ ట్రస్ట్ రూల్స్ ఉల్లంఘిస్తే.. ఆ బాధ్యత పూర్తిగా యాజమాన్యానిదే అవుతుంది. నృపేందర్ రావు ఎలాంటి మోసానికి లేదా తప్పుడు సమాచారానికి పాల్పడలేదు కాబట్టి ఆయన నుంచి డబ్బులు వసూలు చేయలేరని చెప్పింది.

చట్టంలో రికవరీ రూల్ లేదు: కంపెనీ నిధులు బదిలీ చేయనప్పుడు.. సదరు మొత్తాన్ని ఉద్యోగి నుంచి రికవరీ చేయడానికి ఈపీఎఫ్ చట్టంలో ఎలాంటి ప్రత్యేక లీగల్ సెక్షన్ లేదని కోర్టు వెల్లడించింది.

సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన: ఉద్యోగికి కనీసం ముందస్తు షోకాజ్ నోటీసు ఇవ్వకుండా.. ఆయన వివరణ తీసుకోకుండా నేరుగా డబ్బులు కట్టమనడం చట్టవిరుద్ధం అని కోర్టు ఈపీఎఫ్ఓకు చురకలు వేసింది.

చివరగా కంపెనీ నిబంధనలను ఉల్లంఘించిందా లేదా అనే అంశంపై కోర్టు వ్యాఖ్యానించలేదు. ఒకవేళ చట్ట ఉల్లంఘన జరిగి ఉంటే.. ఈపీఎఫ్ఓ

ఆ కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని, అంతేకానీ రిటైరైన ఉద్యోగిని వేధించకూడదని స్పష్టం చేసింది. దాంతో సదరు విశ్రాంత ఉద్యోగికి ఊరట లభించింది.

# బంగారానికి ఏమైంది? ఆల్-టైమ్ హై నుండి అగాధంలోకి రేట్లు.. ఇంకా తగ్గుతాయా?




బంగారం కేవలం ఒక పెట్టుబడే కాదు ఎమోషన్ కూడా ఇండియన్ ఫ్యామిలీస్ కి. 2025లో ఏకంగా 65% బంపర్ రిటర్న్స్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచిన గోల్డ్.. 2026కు వచ్చేసరికి మాత్రం ఇన్వెస్టర్లకు చుక్కలు చూపిస్తోంది. ఈ ఏడాది ఫస్ట్ హాఫ్‌లోనే గోల్డ్ రిటర్న్స్ మైనస్ 4 శాతానికి పడిపోయి షాక్ ఇచ్చింది. జనవరిలో సరికొత్త రికార్డులను సృష్టించిన బంగారం.. ఇప్పుడు ఎందుకు చతికిలపడింది? అసలు మార్కెట్లో ఏం జరుగుతోంది? బంగారం మళ్లీ పుంజుకుంటుందా లేదా అనే ప్రశ్నలకు జవాబు చూద్దాం రండి...

**ఆల్-టైమ్ హై నుండి అగాధంలోకి..**

2026 ప్రారంభం బంగారం మార్కెట్‌కు చాలా అద్భుతంగా దొరికింది. అక్టోబర్ 2022 నుంచి మొదలైన బుల్ రన్ జోష్‌లో.. ఈ ఏడాది జనవరి చివరి నాటికి గోల్డ్ ప్రైస్ 5వేల 602 డాలర్ల ఆల్-టైమ్ హై రికార్డును తాకింది. ఆ తర్వాత మిడిల్ ఈస్ట్ సంక్షోభం తెరపైకి రావడంతో సీన్ మొత్తం రివర్స్ అయింది. యుద్ధ వాతావరణం వల్ల మార్కెట్లలో లిక్విడిటీ కొరత ఏర్పడింది. దీంతో లాభాలను మూటగట్టుకోవడానికి ఇన్వెస్టర్లు బంగారం, వెండిని పెద్ద ఎత్తున అమ్మడం ప్రారంభించారు. ఫలితంగా జూన్ 10 నాటికి గోల్డ్ రేట్ ఏకంగా 28% పడిపోయి 4వేల డాలర్ల వార్షిక కనిష్టానికి పడిపోయింది. ప్రస్తుతం గోల్డ్ 4వేల144 డాలర్ల దగ్గర ఊగిసలాడుతోంది.

**---గోల్డ్ ఎందుకు పెరగట్లేదు?**

అమెరికా-ఇరాన్ మధ్య హోర్ముజ్ జలసంధి ఓపెనింగ్ ఒప్పందం తర్వాత క్రూడ్ ఆయిల్ ధరలు దాదాపు 15% వరకు తగ్గాయి. మరి ఆయిల్ రేట్లు తగ్గినప్పుడు బంగారం ధరలు పెరగాలి కదా? కానీ ఇక్కడే ఒక ట్విస్ట్ ఉంది. ప్రస్తుతం మార్కెట్‌ను శాసిస్తోంది జియోపొలిటికల్ టెన్షన్స్, ఆయిల్ ధరలు కాదు.. అమెరికా సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లు. జూన్ 17న జరిగిన యూఎస్ ఫెడ్ మీటింగ్‌లో కొత్త చైర్మన్ కెవిన్ వార్ష్ కీలక ప్రకటన చేశారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి 2026లో కనీసం ఇంకొకసారైనా వడ్డీ రేట్లను పెంచుతామని హింట్ ఇచ్చారు. పైగా ఎలాంటి ముందస్తు గైడెన్స్ ఇవ్వకపోవడంతో మార్కెట్లో అనిశ్చితి పెరిగి, బంగారంపై తీవ్ర ఒత్తిడి పడింది.

**కింగ్‌లా దూసుకుపోతున్న డాలర్ ఇండెక్స్..**

బంగారానికి, అమెరికా డాలర్‌కు ఎప్పుడూ రివర్స్ రిలేషన్ ఉంటుంది. డాలర్ పుంజుకుంటే బంగారం పడిపోతుంది. 2025లో 12% బలహీనపడిన డాలర్ ఇండెక్స్, 2026లో మాత్రం 2.6% పైగా పుంజుకుని 100 మార్కును దాటేసింది. వడ్డీ రేట్లు ఎక్కువ కాలం పాటు అలాగే ఉంటాయనే భయంతో ఇన్వెస్టర్లు బంగారం వైపు కాకుండా డాలర్ వైపు మొగ్గు చూపుతున్నారు. అందుకే వడ్డీ ఆదాయం ఇవ్వని గోల్డ్ పై ఆకర్షణ తగ్గింది.

-మరి గోల్డ్ బుల్ రన్ ముగిసిపోయినట్లేనా? అంటే ప్రశ్నకు నిపుణులు మిశ్రమంగా స్పందిస్తున్నారు. ఒకవేళ ద్రవ్యోల్బణం తగ్గి, ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తే బంగారం మళ్లీ రాకెట్‌లా దూసుకుపోవచ్చు. ఒకవేళ ద్రవ్యోల్బణం ఇలాగే కొనసాగినా.. సురక్షితమైన పెట్టుబడిగా గోల్డ్‌కు డిమాండ్ పెరుగుతుంది. ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకులు ఇప్పటికీ బంగారాన్ని భారీగా కొనుగోలు చేస్తూనే ఉన్నాయి. కాబట్టి సామాన్య ఇన్వెస్టర్లు మార్కెట్ టైమింగ్స్ గురించి టెన్షన్ పడకుండా, తమ పోర్ట్‌ఫోలియోలో 5 నుండి 10 శాతం వరకు బంగారం వెండికి చోటు కల్పించటం లాంగ్ టర్మ్ గోల్స్‌కు ఎల్లప్పుడూ సేఫ్ బెట్ అంటున్నారు నిపుణులు.

# నెలకు సంపాదన రూ.9 లక్షలు.. అయినా రూ.70లక్షలు అప్పులు: సలహాలు కోరిన అమ్మాయి!

వ్యాపారం సూపర్‌గా నడుస్తోంది. నెలకు దాదాపు 9 లక్షల రూపాయల టర్నోవర్ జరుగుతోంది. పైగా 15 ఏళ్లుగా బిజినెస్ లో అనుభవం ఉంది. అంతా బాగుంది కదా అనుకుంటే పొరపాటే. బయటకి కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్న ఆ సెలూన్ నడిపిస్తున్న ఫ్యామిలీ వెనుక రూ.70 లక్షల భారీ అప్పుల కొండ పేరుకుపోయింది. ఢిల్లీలోని రోహిణి ప్రాంతానికి చెందిన ఒక 21 ఏళ్ల అమ్మాయి తన ఫ్యామిలీ ఎదుర్కొంటున్న ఈ ఆర్థిక సంక్షోభాన్ని రెడ్డిట్ వేదికపై పంచుకోవడంతో ఈ స్టోరీ ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చనీయాంశమైంది.




సదరు యువతి తండ్రి లాయర్ అయినప్పటికీ కేసులు తగ్గడంతో పూర్తి సమయాన్ని సెలూన్ బిజినెస్ పైనే వెచ్చిస్తున్నారు. నెలకు రూ.8లక్షల 94వేల టర్నోవర్ వస్తున్నా.. చేతిలో ఒక్క రూపాయి కూడా మిగలడం లేదు సరే కదా, అప్పులు రోజురోజుకూ కొండలా పేరుకుపోతున్నాయట. దీనికి కారణం వారికున్న భారీ ఖర్చులే. నెలకు షాప్ రెంట్ రూ.లక్షా 30వేలు, ఇంటి అద్దె రూ.40వేలు, స్టాఫ్ జీతాలు రూ.3లక్షల 50వేలు, సెలూన్ ప్రొడక్ట్స్ ఖర్చు రూ.లక్ష, ఇల్లు గడవడానికి మరో రూ.50వేలు ఖర్చవుతున్నాయని చెప్పింది. వీటన్నిటితో పాటు క్రెడిట్ కార్డులు, లోన్ల ఈఎంఐలకోసమే నెలకు మరో రూ.లక్షా 15 వేలు కట్టాల్సి వస్తోందని చెప్పింది. మొత్తం మీద నెలకు రూ.7లక్షల 85వేలు ఖర్చులు పోను పేపర్ మీద లాభం కనిపిస్తున్నా.. పేరుకుపోయిన పాత అప్పులు, వాటి వడ్డీల వల్ల ఆ ఫ్యామిలీ అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతోంది.

ఈ అప్పుల ఊబి నుంచి ఎలాగైనా తన తల్లిదండ్రులను కాపాడుకోవాలని, మార్కెటింగ్ ఫైనాన్స్ పరంగా ఎలాంటి సాయం చేయడానికైనా సిద్ధమేనని ఆ అమ్మాయి రెడ్డిట్ యూజర్ల సలహాలను కోరింది. దీనిపై స్పందించిన నెటిజన్లు ఆ కుటుంబానికి ప్రాక్టికల్ సొల్యూషన్స్ ఇచ్చారు. సెలూన్ కోసం వాడే ప్రొడక్ట్స్ ఖర్చు రూ. లక్ష ఎక్కువగా ఉందని, దాన్ని తగ్గించే మార్గాలను చూడాలని ఒకరు సూచించారు. అలాగే రూ.40వేల అద్దె ఇంటిని వదిలేసి చిన్న ఇంట్లోకి మారాలని, ఇంటి ఖర్చులను రూ.50వేల నుంచి రూ.30వేలకు తగ్గించుకుంటే నెలకు కనీసం 30 నుండి 40 వేల రూపాయలు ఆదా అవుతాయని నేటిజన్లు సలహాలు ఇచ్చారు. ఆ మొత్తాన్ని నేరుగా అప్పులు తీర్చడానికి వాడాలని సూచించారు.

చివరగా ఆ అమ్మాయి చదువు పూర్తి కాగానే ఏదైనా సేఫ్ కార్పొరేట్ ఉద్యోగంలో ద

చేరితే కుటుంబానికి అదనపు ఆదాయం వస్తుందని.. ఇలాంటి క్లిష్ట సమయంలో రిస్క్ ఉన్న పనులు చేయకుండా, ఒక ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్‌ని కలిసి లోన్లను రీస్ట్రక్చర్ చేసుకోవడం బెస్ట్ అని నెటిజన్లు తేల్చి చెప్పారు. ఖర్చులు తగ్గించుకుని, క్రమశిక్షణతో అడుగులు వేస్తేనే ఈ రూ.70 లక్షల అప్పుల చక్రవ్యూహం నుంచి బయటపడటం సాధ్యమవుతుందని నెటిజన్లు తమకు తోచిన సూచనలు చేశారు సెలూన్ ఫ్యామిలీకి.

## కియా కారు కొనే ప్లాన్ ఉందా? అయితే ఇప్పుడే డిసైడ్ అవ్వండి.. పెరగనున్న ధరలు!




కియా కార్ కొనుక్కోవాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే మీకో అర్జెంట్ అప్‌డేట్. కియా ఇండియా తన కార్ల ధరలను పెంచుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. వచ్చే నెల అంటే జూలై 1, 2026 నుండి కియా తన అన్ని కార్ల మోడల్స్, వేరియంట్ల ధరలు 2 శాతం వరకు పెంచుతోంది. పెరిగిన తయారీ ఖర్చులు, పెరిగిన రా మెటీరియల్ ధరలు, ఆపరేషన్ ఖర్చుల వల్లే ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని కంపెనీ స్పష్టం చేసింది.

వాస్తవానికి గత కొంత కాలంగా ఆటోమొబైల్ రంగానికి తయారీ ఖర్చులు భారంగా మారాయి. అయినా కస్టమర్లపై పూర్తి భారం పడకుండా ఉండటానికి తామే చాలా వరకు ఆ నష్టాన్ని భరించామని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ధరల సర్దుబాటు తప్పడం లేదని కియా ఇండియా చెబుతోంది. అయితే ఈ ధరల పెంపు అనేది అన్ని కార్లపై ఒకేలా ఉండదు. కస్టమర్లు ఎంచుకునే మోడల్ వేరియంట్‌ను బట్టి ఈ 2% పరిధిలో మార్పులు ఉంటాయి. ఇది కేవలం కియా కంపెనీ ముచ్చట మాత్రమే కాదు.. ప్రస్తుతం ఆటోమొబైల్ ఇండస్ట్రీ మొత్తం ఇదే ట్రెండ్ ఫాలో అవుతోంది. ఇటీవలే ఆటోమొబైల్ దిగ్గజం 'టాటా మోటార్స్' కూడా తమ కమర్షియల్ వాహనాల ధరలను జూలై 1, 2026 నుండి 2.5 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ముడిసరుకుల ధరలు, లాజిస్టిక్స్ ఖర్చులు విపరీతంగా పెరగడమే దీనికి ప్రధాన కారణంగా టాటా గ్రూప్ చెప్పింది. సో ఒకవేళ మీరు కియా సెల్టోస్, సోనెట్ లేదా ఇన్నోవేటివ్ ఈవీ కార్లను ఇంటికి తెచ్చుకోవాలనుకుంటే.. జూలై 1 లోపు బుక్ చేసుకోవడమే బెస్ట్ ఐడియా.

## మనోళ్లు పేపర్ల మీదే ధనవంతులు.. నిజ జీవితంలో అన్నీ డబ్బు కష్టాలే.. నయా భారతంలో ఆర్థిక ఒత్తిడి




ఒకప్పుడు భారతీయులకు ఇన్వెస్ట్‌మెంట్ అంటే బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, గోల్డ్ లేదా ల్యాండ్ కొని పడేయడమే. కానీ ఇప్పుడు సీన్ పూర్తిగా మారింది. చేతిలో స్మార్ట్‌ఫోన్, బ్యాంక్ అకౌంట్లో కాస్తో కూస్తో డబ్బు ఉంటే చాలు.. కుర్రకారు నేరుగా షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లోకి దూకేస్తున్నారు. ఆఫీస్ లంచ్ రూమ్స్ నుండి ఫ్యామిలీ వాట్సాప్ గ్రూపుల వరకు ఎక్కడ చూసినా లాభాలు, మార్కెట్ కరెక్షన్ల ముచ్చట్లే. అయితే ఈ జోష్ కేవలం ఆర్థిక అవగాహనేనా? లేక అందరూ చేస్తున్నారు కదా అని మనం కూడా దూకాలా అనే ఒక రకమైన సామాజిక ఒత్తిడా? ఇండియాలో మారుతున్న ఈ క్రేజీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రెండ్స్‌పై ఓ లుక్కేద్దాం.

**1. ఫైనాన్షియల్ టాస్క్..**

గతంలో ఇన్వెస్ట్‌మెంట్ అనేది కేవలం పెద్దవాళ్లు లేదా బాగా డబ్బున్నవాళ్లకు మాత్రమే పరిమితం. కానీ ఇప్పుడు అది ఒక కల్చరల్ ఫినామినన్‌గా మారిపోయింది. 2015లో ఇండియన్ ఫ్యామిలీస్ ఫైనాన్షియల్ ఆస్తులలో ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్ల వాటా 7% కంటే తక్కువ ఉంటే.. ఇప్పుడది ఏకంగా 14% కి చేరిందని ఆనంద్ రాఠీ వెల్త్ రిపోర్ట్ బయటపెట్టింది. టెక్నాలజీ పెరగడం, ఈజీ యాప్స్ అందుబాటులోకి రావడం, ఆర్గనైజ్డ్ సెక్టార్‌లో ఉద్యోగాలు పెరగడంతో.. ఈ తరం యువత చాలా చిన్న వయసులోనే కెరీర్‌తో పాటు ఇన్వెస్ట్‌మెంట్‌ను కూడా స్టార్ట్ చేసేస్తోందని రిపోర్ట్ పేర్కొంది.

**2. సోషల్ మీడియా మాయాజాలం..**

ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ వీడియోలు, ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు.. వీరంతా కలిసి ఇన్వెస్ట్‌మెంట్‌ను చాలా కూల్‌గా, ఈజీగా మార్చేశారు. ఇది మంచిదే అయినా.. దీని వెనుక ఒక పెద్ద రిస్క్ దాగుంది. ఎవరో పెట్టిన ప్రాఫిట్ స్క్రీన్‌షాట్ చూసో, వైరల్ అవుతున్న స్టాక్ టిప్స్ చూసో.. నేను ఎక్కడ వెనకబడిపోతానో అనే ఫోమో‌తో చాలామంది ఎలాంటి రీసెర్చ్ లేకుండా గుడ్డిగా డబ్బులు పెట్టేస్తున్నారు. లాంగ్ టర్మ్ గోల్స్ పక్కనపెట్టి, కేవలం ట్రెండ్స్ వెనుక పరిగెడుతూ మార్కెట్ బుల్ జోరులో ఉన్నప్పుడు కొని నష్టపోతున్నారు.

**3. బేసిక్స్ మర్చిపోతే ఎట్లా బిగులూ?**

చిన్న వయసులోనే సంపద సృష్టించాలనే తపన సూపర్. కానీ ఈ తొందరలో చాలామంది తమ ఆర్థిక పునాదిని నిర్లక్ష్యం చేస్తున్నారు. మార్కెట్లో పెద్ద పెద్ద రిటర్న్స్ వెనుక పరుగెడుతూ.. బేసిక్ అవసరాలైన హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, ఎమర్జెన్సీ ఫండ్ వంటి వాటిని లైట్ తీసుకుంటున్నారు. కనీసం 6 నుంచి 12 నెలల ఖర్చులకు సరిపడా అత్యవసర నిధిని పక్కన పెట్టుకున్నాకే మార్కెట్లలోకి రావాలని నిపుణులు మొత్తుకుంటున్నా.. క్రేజ్‌లో పడి యువత వాటిని పట్టించుకోవడం లేదు.

**4. స్క్రీన్ పైనే చూపు.. మైండ్‌లో టెన్షన్**

డిజిటల్ యాప్స్ పుణ్యమా అని ఇప్పుడు పోర్ట్‌ఫోలియో వాల్యూ సెకన్ల వ్యవధిలో మారిపోతుంటుంది. దీంతో రోజుకు వంద సార్లు యాప్ ఓపెన్ చేసి చూడటం చాలామందికి ఒక వ్యసనంగా మారింది. మార్కెట్ కొద్దిగా పడిపోగానే విపరీతమైన యాంగ్జైటీ, స్ట్రెస్ పెరిగిపోతున్నాయి. ఇన్వెస్ట్‌మెంట్ అనేది మనకు భవిష్యత్తులో మనశ్శాంతిని ఇవ్వాలి కానీ.. రోజువారీ జీవితంలో టెన్షన్ పెంచే కొత్త తలనొప్పి కాకూడదు. ఇండియాలో ఇన్వెస్ట్‌మెంట్ విప్లవం రావడం ఖచ్చితంగా మంచి విషయమే. దీంతో లక్షలాది మంది యువకులు దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు అవుతున్నారు. అయితే ఆర్థిక అవగాహనకు, వ్యసనానికి మధ్య ఉండే చిన్న గీత చాలా సన్నటిది. మార్కెట్ వెంట, రిటర్న్స్ వెంట బ్లైండ్‌గా పరుగెత్తడం కంటే.. క్రమశిక్షణతో కూడిన ప్లానింగ్ చాలా ముఖ్యం. సంపదను సృష్టించడం అనేది మన జీవితాన్ని ప్రశాంతంగా మార్చుకోవడానికి అవకాశం అంతే కానీ అది ఇబ్బందులు కలిగించకూడదు. సో మట్నత్తానికి మనం డబ్బును మేనేజ్ చేయాలే గానీ.. డబ్బు మనల్ని మేనేజ్ చేసే స్థాయికి ఒత్తిడిలో పడిపోకూడదు అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేటి నయా భారతంలో కొనసాగుతున్న ఇన్వెస్ట్మెంట్ పరుగు ఆదాయం కంటే అలసటనే ఎక్కువగా ఇస్తోందని పరిశోధనలు చెబుతున్నాయి.



# డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు చేసే కొబ్బరినూనె.. ఎందుకంటే..?

డయాబెటిస్ అనేది ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. దీని బారిన పడుతున్న వారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా యుక్త వయస్సులో ఉన్నవారు అధిక శాతం మంది టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అస్తవ్యవస్తమైన జీవన శైలి ఈ వ్యాధి వచ్చేందుకు ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఆహారం విషయంలో చాలా మంది తగు జాగ్రత్తలు పాటించడం లేదని, దీని వల్లే టైప్ 2 డయాబెటిస్ వస్తుందని అంటున్నారు. డయాబెటిస్ వచ్చిన వారు ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. లేదంటే వ్యాధి మరింత ముదిరే ప్రమాదం ఉంటుంది. ఆహారంలో పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకోవడం పూర్తిగా తగ్గించాలి. లేదా మానేస్తే మంచిది. ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకుంటే మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

**రోజూ ఇలా తీసుకోవాలి..**

డయాబెటిస్ ఉన్నవారు పిండి పదార్థాలు, చక్కెర అధికంగా ఉండే ఆహారాలను తినడం వల్ల శరీరంలో కొవ్వు నిల్వలు పేరుకుపోతాయి. దీంతో ఇన్సులిన్ నిరోధకత మరింత పెరుగుతుంది. దీని వల్ల షుగర్ మరింత ఎక్కువవుతుంది. కనుక ఆయా ఆహారాలను తీసుకోవడం పూర్తిగా తగ్గించాల్సి ఉంటుంది. ఫైబర్ ఉండే ఆహారాలను తినాలి. దీని వల్ల షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అయితే డయాబెటిస్ ఉన్నవారు కొబ్బరినూనెను ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కొబ్బరినూనె డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని అంటున్నారు. కొబ్బరినూనెను రోజూ వంట నూనెగా ఉపయోగించవచ్చు. లేదా రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ మోతాదులో తీసుకోవచ్చు. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

**ఇన్సులిన్ నిరోధకతకు..**

డయాబెటిస్ ఉన్నవారు రోజూ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచవచ్చు. దీంతో ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారికి సహజంగానే అజీర్తి సమస్య ఉంటుంది. ఆహారం జీర్ణమవడం ఆలస్యం అవుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకుంటే ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. అలాగే షుగర్ ఉంటే మలబద్ధకం కూడా ఇబ్బంది పెడుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల మలబద్ధకం అన్న మాటే ఉండదు. రోజూ ఉదయం సుఖంగా విరేచనం అవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది.

**ఇన్‌ఫెక్షన్లకు చెక్..**

కొబ్బరినూనెను సేవించడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. కొబ్బరినూనె యాంటీ మైక్రోబియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారికి తరచూ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. కనుక వారు కొబ్బరినూనెను తీసుకుంటే ఇన్‌ఫెక్షన్‌లకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా చర్మంపై, జననావయవాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. చర్మం పొడిబారకుండా చూస్తుంది. చర్మం కాంతివంతంగా కనిపించేలా చేస్తుంది. అలాగే శిరోజాలు దృఢంగా ఆరోగ్యంగా ఉంటాయి. జుట్టు రాలడం తగ్గిపోతుంది. డయాబెటిస్ ఉన్నవారు కొబ్బరినూనెను తీసుకుంటే ఇలా అనేక రకాలుగా లాభాలను పొందవచ్చు.

# ఆస్తమా ఉందా.. అయితే ఈ చిట్కాలను పాటించండి.. ఉపశమనం లభిస్తుంది..!



చలికాలంలో లేదా ఇతర సమయాల్లో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చాలా మందికి శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సమస్యల బారిన పడుతుంటారు. అయితే ఇవి సహజంగా వచ్చేవే. కానీ ఆస్తమా ఉన్న వారికి మాత్రం సీజన్లు మారినప్పుడు లేదా చల్లని వాతావరణం ఉన్నప్పుడు తీవ్రంగా ఇబ్బంది కలుగుతుంది. ఆస్తమాతో అల్లాడిపోతారు. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు డాక్టర్ ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడాలి. అలాగే ఆహారం విషయంలోనూ అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల సమస్య నుంచి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. అలాగే శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. ఊపిరి సరిగ్గా పీల్చుకోగలుగుతారు.

**పసుపు..**

ఆస్తమా ఉన్నవారికి పసుపు ఎంతో మేలు చేస్తుంది. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆస్తమా నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. అందుకుగాను రోజూ రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కొద్దిగా పసుపును కలుపుకుని తాగాలి. ఇలా రోజూ చేయాలి. దీని వల్ల ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం పొందవచ్చు. అలాగే ఆహారం విషయానికి వస్తే ఫ్లేవనాయిడ్స్, విటమిన్లు సి, డి, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల కూడా ఆస్తమా ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ ఆహారాల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తీసుకుంటే శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల శ్వాస నాళాలు క్లియర్‌గా మారి ఊపిరి సరిగ్గా తీసుకోగలుగుతారు. ఇందుకు గాను నారింజ, నిమ్మ, కివీ, ఆలుగడ్డలు, పాలు, చేపలు, గుడ్లు, లివర్, జున్ను, తృణ ధాన్యాలు, సిట్రస్ పండ్లను తీసుకోవాల్సి ఉంటుంది.

**అల్లం..**

ఆస్తమా ఉన్నవారు టీ, కాఫీలను తరచూ తాగుతుండాలి. చక్కెర లేకుండా బ్లాక్ టీ లేదా బ్లాక్ కాఫీ తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. వీటిల్లో అధికంగా ఉండే కెఫీన్ ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. అలాగే శ్వాసనాళాలపై పడే ఒత్తిడి తగ్గిపోతుంది. దీంతో శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. అయితే కెఫీన్‌ను మరీ అధికంగా తీసుకోకూడదు. రోజుకు 3 లేదా కప్పుల టీ లేదా కాఫీ తాగాలి. అంతకు మించి తాగకూడదు. ఇక ఆస్తమాను తగ్గించుకునేందుకు అల్లం కూడా బాగానే పనిచేస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫాన్ని తొలగిస్తుంది. శ్వాస నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీని వల్ల శ్వాస సరిగ్గా లభిస్తుంది. ఆస్తమా నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం రసాన్ని రోజూ రెండు పూటలా పూటకు ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**యూకలిప్టస్ ఆయిల్..**

యూకలిప్టస్ ఆయిల్‌ను వాడుతున్నా కూడా ఆస్తమా లక్షణాలను తగ్గించుకోవచ్చు. ఇది దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో సహాయం చేస్తుంది. శ్వాసనాళాల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. కఫం కరిగిపోతుంది. ఒక ఖర్చీఫ్ మీద కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి దాన్ని నిద్రించేటప్పుడు ముక్కుకు దగ్గరగా పెట్టుకోవాలి. లేదా మరుగుతున్న నీటిలో కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి అనంతరం వచ్చే ఆవిరిని బాగా పీల్చాలి. ఇలా చేస్తున్నా కూడా ఉపశమనం లభిస్తుంది. శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. గాలి సరిగ్గా లభిస్తుంది. ఈ విధంగా పలు ఆహారాలను తీసుకుంటూ ఆయా చిట్కాలను పాటిస్తుంటే ఆస్తమా లక్షణాలను చాలా వరకు తగ్గించుకుని ఉపశమనం పొందవచ్చు.

# లావు ఉన్న వారికి నిమ్మ తొక్కలు ఓ వరం.. ఎలా అంటే?

మనమందరం నిమ్మకాయలను వివిధ సందర్భాల్లో ఆహారంలో వినియోగిస్తుంటాము. అయితే ఎక్కువ మంది నిమ్మ రసాన్ని వాడుకుని.. దాని తొక్కలను పడేస్తుంటారు. అలా తొక్కే కదా అని పడేస్తే.. మనం చాలా నష్టపోయినట్లే అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అధిక బరువు ఉన్న వాళ్లకు ఈ నిమ్మ తొక్కలు వరం లాంటివి. వాటిని సరిగ్గా వినియోగించుకుంటే.. బాడీ ఫ్యాట్ తగ్గి.. నాజూగ్గా మారవచ్చు. మరి.. నిమ్మ తొక్కలను ఎలా ఉపయోగిస్తే.. అధిక బరువు తగ్గొచ్చు ఇప్పుడు తెలుసుకుందాం..



నిమ్మ జ్యూస్ లో కంటే తొక్కలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయని చాలా మందికి తెలియదు. ఈ తొక్కలు ఒక న్యూట్రియెంట్ పవర్ హౌస్ లాంటివి అని నిపుణులు చెబుతున్నారు. ఈ తొక్కలో విటమిన్-సి, డీ-లిమొనెన్, ఫెక్టిన్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉన్నాయి. దీనిలోని విటమిన్ సీ శరీరంలోని రోగ నిరోధక శక్తిని బూస్ట్ చేస్తుంది. అలానే మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి కణాల డ్యామేజ్‌ను విటమిన్-సి ఆపుతుంది. అలానే దీనిలోని ఫైబర్, ఫెక్టిన్ అనేవి జీర్ణ వ్యవస్థకు హెల్ప్ చేస్తాయి. వీటి వల్ల త్వరగా ఆకలి వేయదు. ఫ్లేవనాయిడ్స్, డీ-లిమొనెన్ లు మెటబాలిజంను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. బోన్ హెల్త్‌కు కాల్షియం, మెగ్నీషియం బలం ఇస్తాయి.

నిమ్మ తొక్కలో ఉండే డీ-లిమొనెన్ శరీరంలోని కాంపౌండ్ కొవ్వును కరిగించడానికి మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. ఈ తొక్కను మన డైలీ లైఫ్ లో చేర్చుకోవడం చాలా ఈజీ. నిమ్మ తొక్కలను బాగా కడిగిన తర్వాత ఎండలో ఉంచి డ్రై చేయాలి. బాగా ఎండిన తర్వాత మిక్సీలో వేసి .. పౌడర్ లా చేయాలి. ఆ పౌడర్ ను రోజూ ఉదయం ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో కలుపుకొని తాగాలి. అలా రోజూ చేయడం వల్ల.. మనకు తెలియకుండానే బాడీ వెయిట్ తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గేందుకు వేలకు వేలు ఖర్చు చేయకుండా నిమ్మ తొక్కలతోనే మార్పు తెచ్చుకోవచ్చు. వాతావరణం మారినప్పుడు వచ్చే వచ్చే జలుబు, దగ్గు లాంటి వాటి నుంచి శరీరం త్వరగా కోలుకునేందుకు నిమ్మ తొక్కలు ఉపయోగపడతాయట.

# పీనట్ బటర్ ఆరోగ్యకరమైందేనా..?

## దీన్ని రోజుకు ఎంత తినాలి..? దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయి..?

మార్కెట్‌లో మనకు అనేక రకాల ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. చాలా రకాల ఆహారాలు మనకు ప్రకృతి సహజసిద్ధంగా అందిస్తుంది. కొన్ని రకాల ఆహారాలను మనం తయారు చేసుకుని తింటాం. వాటిల్లో ఆరోగ్యకరమైనవి, అనారోగ్యకరమైనవి కూడా ఉంటాయి. అయితే ఆరోగ్యకరమైన ఆహారాల విషయానికి వస్తే వాటిల్లో పీనట్ బటర్ కూడా ఒకటి. పల్లీల నుంచి దీన్ని తయారు చేస్తారు. సాధారణంగా చాలా మంది దీన్ని అనారోగ్యకరమైన ఆహారం అని భావిస్తారు. ఎందుకంటే ఇందులో కొవ్వులు, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి కనుక దీన్ని తినకూడదని, ప్రమాదమని అనుకుంటారు. కానీ ఇందులో నిజం లేదు. ఎందుకంటే పీనట్ బటర్ వాస్తవానికి ఆరోగ్యకరమైనదే. కానీ ఇందులో చక్కెరలు, అనారోగ్యకరమైన కొవ్వులు, ఉప్పు వంటి ఆహారాలను కలపకుండా తయారు చేసింది అయి ఉండాలి. అలాంటి పీనట్ బటర్‌నే మనం తినాల్సి ఉంటుంది. మార్కెట్‌లో చాలా రకాల పీనట్ బటర్ బ్రాండ్లు మనకు లభిస్తున్నాయి. కనుక వాటిని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

**ప్రోటీన్లు అధికం..**

ఎలాంటి కృత్రిమ పదార్థాలు, చక్కెర, ఉప్పు లాంటి పదార్థాలను కలపకుండా తయారు చేసిన పీనట్ బటర్ అయితేనే మనం ఉపయోగించాలి. అలాంటి పీనట్ బటర్‌ను తింటేనే ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి. పీనట్ బటర్ మనకు అనేక లాభాలను అందిస్తుంది. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనకు అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మాంసాహారం తినని వారికి కావల్సిన ప్రోటీన్లను పీనట్ బటర్ అందిస్తుంది. ఇందులో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి కండరాల కణజాలానికి మరమ్మత్తులు చేస్తాయి. దీని వల్ల కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. శరీరానికి శక్తి లభిస్తుంది. పీనట్ బటర్‌ను తింటే ఆరోగ్యకరమైన కొవ్వులను పొందవచ్చు. ఇందులో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి మంచి కొవ్వుల జాబితాకు చెందుతాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

**కండరాల ఆరోగ్యానికి..**

పీనట్ బటర్‌లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. విటమిన్ ఇ వల్ల చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పీనట్ బటర్‌ను తింటే అధిక మొత్తంలో మెగ్నిషియం లభిస్తుంది. ఇది కండరాలను దృఢంగా ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. నాడీ మండల వ్యవస్థ చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతుంది. దీంతో ఉత్సాహంగా ఉంటారు.



యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. పీనట్ బటర్‌లో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ బి3 అధికంగా ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారం సులభంగా శక్తిగా మారేందుకు దోహదం చేస్తుంది. దీని వల్ల శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి.

**హైబీపీ ఉన్నవారికి..**

పీనట్ బటర్‌లో అధికంగా ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. శరీరంలో సోడియం స్థాయిలను తగ్గించి బీపీ అదుపులో ఉండేలా చేస్తుంది. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుతుంది. పీనట్ బటర్‌ను తింటే జింక్ కూడా అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఈ విధంగా పీనట్ బటర్ మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అయితే మార్కెట్‌లో ఏ పీనట్ బటర్ పడితే దాన్ని కొనకూడదు. కృత్రిమ పదార్థాలు లేని పీనట్ బటర్‌ను కొని వాడితే మేలు జరుగుతుంది. ఇక దీన్ని రోజుకు 2 టేబుల్ స్పూన్లకు మించి తినకూడదు. అలర్జీలు ఉన్నవారు పీనట్ బటర్‌ను తినకూడదు. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ దీన్ని తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# 2027 వరల్డ్ కప్ కోసం కొత్త స్కెచ్.. కేఎల్ రాహుల్‌ను పక్కన పెట్టిన భారత్!



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నైలోని చేపాక్ స్టేడియంలో భారత్ వర్సెస్ ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరుగుతున్న మూడో వన్డేలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్థాన్ మొదట బ్యాటింగ్ తీసుకోగా, టీమిండియా చెపాక్ పిచ్‌పై టార్గెట్‌ను ఛేజ్ చేయడానికి రెడీ అయింది. అయితే, మ్యాచ్ స్టార్ట్ అవ్వగానే భారత ఫ్యాన్స్ అందరినీ ఒకే ప్రశ్న వేధించింది.. ప్లేయింగ్ ఎలెవెన్‌లో కేఎల్ రాహుల్ ఎందుకు లేదని.

**కేఎల్ రాహుల్ ఎందుకు ఆడట్లేదంటే?:**

ఫామ్‌లో ఉన్నప్పటికీ కేఎల్ రాహుల్‌ను ఈ మ్యాచ్ తుది జట్టు నుంచి తప్పించారు. దీనికి కారణం జట్టు కాంబినేషన్, ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి టీమ్‌లోకి తిరిగి రావడం కోసమే.. సిరీస్ ఆల్రెడీ 2--0తో ఇండియా గెలవడంతో.. బెంచ్ స్ట్రెంత్‌ను పరీక్షించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ రాహుల్‌కు రెస్ట్ ఇచ్చి, ఆల్ రౌండ్ ఆప్షన్ కోసం మన తెలుగు కుర్రాడు నితీష్ రెడ్డిని తుది జట్టులోకి తీసుకుంది. కేఎల్ రాహుల్‌తో పాటు జట్టులో మొత్తం మూడు మార్పులు చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ, హర్ష్ దూబే, నితీష్ రెడ్డిలు టీమ్‌లోకి వచ్చారు.

**గిల్ మైండ్ గేమ్:**

భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. పిచ్ చాలా బాగుంది, ఒకవేళ మేము టాస్ గెలిచినా మొదట బ్యాటింగే తీసుకునే వాళ్లం.. గత మ్యాచ్ లాగే ఇక్కడ కూడా ఎండ చాలా ఎక్కువగా ఉంది. కానీ, ఈ మ్యాచ్‌లో మేము మొదట ఫీల్డింగ్ చేయాల్సి రావడం ఒక రకంగా మంచిదే. ఎందుకంటే, పెద్ద స్కోర్లను ఈజీగా, కన్సిస్టెంట్‌గా ఛేజ్ చేయడం అనే ఒక ఏరియాలో మేము ఇంకా పర్‌ఫెక్ట్ అవ్వలేదన్నాడు. ఈరోజు మా ఛేజింగ్ గేమ్ ఎలా ఉందో చూసేందుకు ఇదొక సూపర్ ఛాన్స్ అని గిల్ పేర్కొన్నాడు.

# జైస్వాల్ జోరు, రోహిత్ రచ్చ.. ఆఫ్ఘన్‌పై భారత్ ఘన విజయం.. 3-0తో సిరీస్ కైవసం!



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నైలోని ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియం వేదికగా జరిగిన మూడో వన్డేలో భారత జట్టు అన్‌స్టాపబుల్ పర్ఫామెన్స్‌తో రచ్చ లేపింది. ఆఫ్ఘన్ నిర్దేశించిన 219 పరుగుల టార్గెట్‌ను ఇండియన్ బ్యాటర్లు ఆడుతూ పాడుతూ కేవలం ఒకే ఒక్క వికెట్ కోల్పోయి ఊదేశారు. ఈ ఘన విజయంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 3--0తో క్లీన్ స్వీప్ చేసి ట్రోఫీని తన ఖాతాలో వేసుకుంది.

**షాహిదీ సెంచరీతో పోరాడిన ఆఫ్ఘన్:**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ తీసుకున్న ఆఫ్ఘనిస్థాన్‌కు భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ (5 వికెట్లు) పవర్ ప్లేలోనే చుక్కలు చూపించాడు. కేవలం 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడ్డ ఆఫ్ఘన్ జట్టును ఆ జట్టు కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. అద్భుతమైన క్లాస్ ఇన్నింగ్స్ ఆడిన షాహిదీ వన్డేల్లో తన మొట్టమొదటి సెంచరీ (102 పరుగులు) నమోదు చేయగా, ఆల్ రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) అతనికి సూపర్ సపోర్ట్ ఇచ్చాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌట్ అయింది.

**రోహిత్-జైస్వాల్ రుద్రరూపం:**

219 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మలు బుల్లెట్ లాంటి స్టార్ట్ ఇచ్చారు. ఆఫ్ఘన్ బౌలర్లకు ఏమాత్రం ఛాన్స్ ఇవ్వకుండా బౌండరీల వర్షం కురిపించారు. ఇద్దరూ పోటీ పడుతూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నాక మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలోనే మొదటి వికెట్‌కు ఏకంగా 170 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను వన్ సైడ్ చేసేశారు.

# మెస్సీకి రెడ్ కార్డ్ ఇవ్వాల్సిందే.. అర్జెంటీనాపై అల్జీరియా కంప్లైంట్.. రంగంలోకి ఫిఫా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ 2026 మెగా టోర్నీలో అర్జెంటీనా కెప్టెన్, ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సీ హాట్రిక్ గోల్స్‌తో (3-0 తేడాతో అల్జీరియాపై విజయం) అదిరిపోయే స్టార్ట్ అయితే ఇచ్చాడు కానీ.. మ్యాచ్ ముగిశాక అసలైన లొల్లి మొదలైంది. ఈ మ్యాచ్‌లో రెఫరీ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ అల్జీరియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమైక్య కు అధికారికంగా కంప్లైంట్ చేసింది. ముఖ్యంగా మెస్సీ చేసిన ఒక పౌల్‌కు రెడ్ కార్డ్ ఇవ్వాల్సిందేనని అల్జీరియా పట్టుబడుతోంది.

**కాలితో తన్నిన మెస్సీ.. రెఫరీ సైలెంట్:**

మ్యాచ్ ఫస్ట్ హాఫ్‌లో అర్జెంటీనా 1--0తో ముందంజలో ఉన్న సమయంలో ఈ వివాదాస్పద ఘటన చోటు చేసుకుంది. బంతి కోసం పోటీ పడుతున్న క్రమంలో మెస్సీ తన బూటును పైకెత్తి అల్జీరియా కెప్టెన్ ఐస్సా మాండి పిక్కపై వెనుక నుంచి బలంగా తన్నాడు. అల్జీరియా ప్లేయర్లు దీనిపై గట్టిగా అప్పీల్ చేసినప్పటికీ, ఆన్-ఫీల్డ్ రెఫరీ కనీసం ఫౌల్ కూడా ఇవ్వలేదు.. అటు వీడియో అసిస్టెంట్ రెఫరీ కూడా దీనిని రివ్యూ చేయలేదు.

అల్జీరియా ఫుట్‌బాల్ ప్రతినిధి మాట్లాడుతూ.. మా కంప్లైంట్ ముఖ్యంగా మెస్సీ చేసిన ఆ ప్రమాదకరమైన ఫౌల్ గురించే.. దానికి ఖచ్చితంగా డైరెక్ట్ రెడ్ కార్డ్ ఇవ్వాలి.. అర్జెంటీనా మాకంటే బాగా ఆడిందనే విషయాన్ని మేము ఒప్పుకుంటాం, కానీ ఇలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకున్నప్పుడు మేము సైలెంట్‌గా ఉండలేం.. మ్యాచ్‌లో ఇలాంటివి 3 సంఘటనలు జరిగాయి, దేనికీ VAR స్పందించలేదని ఆరోపించారు. అంతేకాదు, సెకండ్ హాఫ్‌లో అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ అలెక్సిస్ మెక్ అలిస్టర్.. గాల్లోకి లేచి బంతిని హెడ్ చేసే క్రమంలో అల్జీరియా ప్లేయర్ ఇబ్రహీం మాజాను మోచేత్తో కొట్టాడని, దానికి కూడా రెఫరీ ఫౌల్ ఇవ్వలేదని అల్జీరియా పేర్కొంది.

**మెస్సీకి ఒక రూల్.. మాకో రూలా?:**

మెస్సీకి రెడ్ కార్డ్ ఇవ్వకపోవడంపై సోషల్ మీడియాలో ఫ్యాన్స్, ఎక్స్‌పర్ట్స్ మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. దీనిపై సౌతాఫ్రికా హెడ్ కోచ్ హ్యూగో బ్రూస్ తీవ్రంగా విమర్శించారు. దాదాపు ఇలాంటి ఫౌల్ చేసినందుకే దక్షిణాఫ్రికా జట్టు మిడ్‌ఫీల్డర్ థెంబ జ్వానేపై ఫిఫా మూడు మ్యాచ్‌ల నిషేధం విధించింది. మరీ మెస్సీ విషయంలో జరిగిన దాన్ని చూశాక, మా ప్లేయర్‌కు ఇచ్చిన శిక్షను నేను అస్సలు ఒప్పుకోను.. మెస్సీ లాంటి క్వాలిటీ ప్లేయర్లు గ్రౌండ్‌లోనే ఉండాలి, అందులో డౌట్ లేదు.. కానీ ఒకే రకమైన తప్పుకు ఇద్దరు ప్లేయర్ల మధ్య రెఫరీలు ఇంత వ్యత్యాసం ఎలా చూపిస్తారో నాకు అర్థం కావడం లేదన్నారు.

## టాలీవుడ్‌లో నాగదుర్గకు భారీ అవకాశం



# యష్ ‘టాక్సిక్’.. ఆ విషయంలో ఫెయిల్ అయ్యారా?



రాకింగ్ స్టార్ యష్ పేరు వినగానే ప్రేక్షకులకు ముందుగా గుర్తుకు వచ్చేది కేజీఎఫ్ సిరీస్. ఆ సినిమాలతో ఆయన పాన్ ఇండియా స్టార్ గా క్రేజ్ సొంతం చేసుకున్నారు. అందుకే ఆయన నుంచి వచ్చే ప్రతి కొత్త ప్రాజెక్టుపై భారీ అంచనాలు ఉంటాయి. ప్రస్తుతం యష్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ కూడా అలాంటి అంచనాల మధ్య రూపుదిద్దుకుంటోంది. అయితే సినిమా రిలీజ్ డేట్ పై క్లారిటీ లేనప్పటికీ, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికర చర్చ నడుస్తోంది.

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న టాక్సిక్ ను కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా యాక్ట్ చేస్తున్నారు. అలాగే హ్యూమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార వంటి స్టార్ బ్యూటీలు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్, స్టార్ క్యాస్ట్, ఇంటర్నేషనల్ రేంజ్ ప్రొడక్షన్ వాల్యూస్ తో ఆ సినిమా మొదటి నుంచే హాట్ టాపిక్ గా మారింది. సినిమా ప్రకటించిన సమయంలో వచ్చిన పోస్టర్లు, కాన్సెప్ట్ వివరాలు అభిమానుల్లో మంచి ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా కేజీఎఫ్ తర్వాత యష్ ఎలాంటి కథను ఎంచుకున్నారనే విషయంపై నేషనల్ వైడ్ గా చర్చ జరిగింది. దీంతో టాక్సిక్ పై మొదటి నుంచే మంచి బజ్ ఏర్పడింది. అయితే ఆ బజ్ ను మేకర్స్ ఎక్కువ కాలం కొనసాగించలేకపోయారనే అభిప్రాయం ఇప్పుడు కొందరిలో వ్యక్తమవుతోంది.సాధారణంగా భారీ పాన్ ఇండియా సినిమాలకు సంబంధించి తరచూ అప్డేట్లు, పోస్టర్లు, వీడియోలు లేదా షూటింగ్ విశేషాలు విడుదల చేస్తుంటారు. దీంతో సినిమా ప్రేక్షకుల దృష్టిలో కంటిన్యూగా ఉంటుంది. కానీ టాక్సిక్ విషయంలో అలాంటి ప్రమోషనల్ యాక్టివిటీ తక్కువగా కనిపించిందనే అభిప్రాయం సోషల్ మీడియాలో వినిపిస్తోంది. సినిమా గురించి కొత్త సమాచారం లేకపోవడం, విడుదల తేదీపై కూడా స్పష్టత లేకపోవడం వల్ల మొదట్లో ఉన్న హైప్ కొంత తగ్గిందని కొందరు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.ముఖ్యంగా సోషల్ మీడియా యుగంలో ప్రేక్షకుల దృష్టిని నిలబెట్టుకోవడం చాలా కీలకంగా మారింది. వరుస అప్డేట్స్ లేకపోతే ఎంత పెద్ద స్టార్ సినిమా అయినా చర్చల నుంచి కొంతకాలం దూరమవుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే ఇప్పుడు టాక్సిక్ విషయంలో జరిగిందని కొందరు సినీ ప్రియులు చెబుతున్నారు. అయితే మరికొందరు మాత్రం ఆ వాదనతో ఎగ్రీ అవ్వడం లేదు.పెద్ద సినిమాల విషయంలో మేకర్స్ కొన్నిసార్లు కావాలనే సైలెంట్ స్ట్రాటజీ ఫాలో అవుతారని వారు గుర్తు చేస్తున్నారు. సరైన సమయంలో టీజర్, ట్రైలర్ లేదా గ్లింప్స్ విడుదల చేస్తే మళ్లీ సినిమా ఒక్కసారిగా వార్తల్లోకి వస్తుందని అంటున్నారు. యష్ కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఒక్క అప్డేట్ వచ్చినా సినిమా మళ్లీ ట్రెండింగ్ లోకి వెళ్లే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.ఏదేమైనా యష్ అభిమానులు కూడా సినిమా నుంచి కొత్త అప్డేట్ల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో మేకర్స్ ప్రమోషన్ల స్పీడ్ పెంచుతారా? ప్రస్తుతం తగ్గినట్లు కనిపిస్తున్న బజ్ మళ్లీ పీక్ రేంజ్ కు తీసుకెళ్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అలా టాక్సిక్ పై ఆసక్తి తగ్గలేదుగానీ, ఆ బజ్ ను కొనసాగించే విషయంలో మేకర్స్ మరింత జోష్ గా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం మాత్రం వినిపిస్తోంది.



**ఆయిషా శర్మ: ఆకర్షణీయమైన సొగసు మరియు పెరుగుతున్న స్టార్ ఇమేజ్**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965